ఈనాడు
తిరుపతి
మంగళవారం అక్టోబరు 1, 2024

దేదీప్యమానం




అలిపిరి గరుడ కూడలి ఆర్చికి విద్యుదీపాలంకరణ



వజ్రకిరీటం

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందడి మొదలైంది. అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం నుంచి గరుడ కూడలి వరకు విద్యుదీపాలంకరణ ఇలవైకుంఠం తలపిస్తోంది. విద్యుదీపాలతో ఏర్పాటు చేసిన మహావిష్ణువు దశావతారాలు.. ఆనందనిలయం.. వజ్ర కిరీటం చక్రత్తాళ్వారు.. సీతారామలక్ష్మణులు.. శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి తదితర నమూనాలు నయనానందకరంగా కనిపిస్తున్నాయి. తిరుమలకు వెళ్లే భక్తులు కనువిందు చేసే వాటిని తిలకించి ఆనందిస్తున్నారు.. చరవాణుల్లో చిత్రీకరిస్తున్నారు. - ఈనాడు, తిరుపతి



కనువిందు చేస్తున్న గరుడ కూడలి..



మహావిష్ణువు దశావతారం

వాటాలుగా నీటి దోపిడీ

- నిబంధనలకు తూట్లు పొడుస్తూ దందా
- ఏటా రూ.కోట్లు బొక్కేస్తున్న వైనం

గూడూరు, న్యూస్‌టుడే: పరిశ్రమల నీటి అవసరాలను వైకాపా నేతలు ఆసరాగా తీసుకున్నారు. ప్రకృతి వనరుల దోపిడీలో ముందున్న నేతలు నీటి అవసరాన్ని అదనుగా భావించి రూ.కోట్లు వెనకేసుకున్నారు. నీటి అవసరాలు తీర్చడానికి వాటాలుగా ఏమార్చి దోపిడీ చేస్తున్నారు. పరిశ్రమలు, సెజ్‌లు ఉన్న ప్రాంతాల్లో నిబంధనలు పక్కన పెట్టి రూ.కోట్లలో సొమ్ము చేసుకున్నారు. జిల్లాలో పారిశ్రామికవాడలకు ప్రభుత్వం 4.70 టీఎంసీలు కేటాయించింది. ఇందుకు ఎత్తిపోతల ద్వారా రూ.619 కోట్లు మంజూరు కాగా.. వైకాపా పాలనలో పక్కన పెట్టేశారు. ఇది ఇక్కడి అక్రమార్కులకు వరంగా మారింది. పరిశ్రమలున్న ప్రాంతాల్లో నేతలు దీనిని ఓ వనరుగా మార్చుకుని ఫిల్టర్ పాయింట్ల ద్వారా ట్యాంకర్లలో నీటిని పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నారు.



నాయుడుపేట సెజ్‌లో నీటి ట్యాంకర్లు



అత్తివరంలో ట్యాంకర్ల హడావుడి

మేనకూరు పారిశ్రామికవాడ, ప్రత్యేక ఆర్థిక మండలిలోని పలు పరిశ్రమలకు నీటి అవసరాలు ఉన్నాయి. మేనకూరు, మనవాలి తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ రూ.5 వేల చొప్పున విక్రయిస్తున్నారు. రోజూ 200-300 ట్యాంకర్ల మేర నీటి సరఫరా జరుగుతోంది. ఈ లెక్కన రోజుకి రూ.12.50 లక్షల ట్యాంకర్ల వ్యాపారం కాగా ఏటా రూ.45.62 కోట్ల మేర దందా సాగుతోంది.

ఏటా రూ.50 కోట్ల వ్యాపారం

అంతా ఆ నేత కనుసన్నల్లో..

ఇక్కడ పార్టీ ఏదైనా అధికారం మాత్రం ఓజిలి మండలానికి చెందిన సదరు నేతదే. అత్తివరం పారిశ్రామికవాడలో నీటి సరఫరా గుత్తాధిపత్యం ఆయనదే. ఆయన ఫిల్టర్ పాయింట్ దగ్గరే ట్యాంకర్లు నీటిని పట్టుకోవాలి. నీటిని పట్టుకున్నందుకు ట్రాక్టర్‌కు రూ.150, లారీకి రూ.300 సమర్పించాలి. గతంలో ఇక్కడి రైతులే అరకొరగా సరఫరా చేసే పరిస్థితి కాగా.. తాజాగా అంతా తానై నీటి సరఫరా గుత్తాధిపత్యం సాధించడం గమనార్హం. ఇక్కడి నుంచి రోజుకి 100-200 ట్యాంకర్ల మేర సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ నీరు రూ.1,000 కాగా రోజుకి రూ.లక్ష ఏటా రూ.3.65 కోట్లు ఆయన చేతుల్లోకి చేరుతోంది. ఇదే తీరుగా తడ మండలం మాంబట్టు, చిల్లకూరు మండలంలోని పలు ప్రాంతాల్లోని పరిశ్రమలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది.

రహదారుల పనులంటూ..

జాతీయ రహదారుల విస్తరణ పనులకు నీటిని సరఫరా చేసేందుకు కొందరు నేతలు గుత్తేదారు అవతారమెత్తి సరఫరా చేస్తున్నారు. ఇలా రహదారుల నిర్మాణ గుత్తేదారులు నుంచి రూ.కోట్లలో స్వాహా చేశారు. రైతుల పేరిట ఉన్న బోర్ల ద్వారా నీటి వ్యాపారం చేయడం గమనార్హం. దీనిపై ఏపీఐఐసీ ఉప జోనల్ మేనేజర్ చంద్రశేఖరయ్యను వివరణ కోరగా నీటి పనులు వేగంగా సాగుతున్నట్లు వివరించారు.

వదల.. బొమ్మాళీ



- ఎస్వీయూలో తిష్ఠవేసిన విశ్రాంత ఆచార్యులు

విశ్రాంత ఆచార్యులు ఎస్వీయూలో తిష్ఠ వేశారు. దశాబ్దాల కిందటే పదవీ విరమణ పొందినా.. ఇప్పటికీ ఆయా విభాగాల్లో వారికి కేటాయించిన గదులను ఎంతకూ వదలడం లేదు. వాటిని తమ స్వప్రయోజనాలకు వాడుకుంటున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆచార్యులు అప్పుడప్పుడు వస్తూ పరిశోధక విద్యార్థులకు తాము మార్గదర్శనం చేస్తున్నామంటూ చెబుతూ వెళ్లిపోతున్నారని పేర్కొంటున్నారు. మరికొందరు మిత్రులతో వారాంతపు సమావేశాలకు వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (బైరాగిపట్టెడ)

వర్సిటీలో 507 మంది రెగ్యులర్ ఆచార్యులకుగాను 156 మంది ఉన్నారు. 351 ఖాళీలు ఉన్నాయి. ఇద్దరు మాజీ ఉపకులపతులు, మరో ఇద్దరు రిజిస్ట్రార్లు, ఓ రెక్టార్, దూరవిద్య విభాగంలో పనిచేసిన ఇద్దరు ఆచార్యులు, సైన్స్, ఆర్ట్స్ విభాగాల్లోని ఆచార్యులు గదులు ఖాళీ చేయనివారిలో ఉన్నారు. వాటిలో వర్సిటీకి చెందిన రూ.లక్షల విలువచేసే కంప్యూటర్లు, స్కానర్లు, ప్రింటర్లు, ఏసీలు, విలువైన పుస్తకాలతోపాటు ఫర్నిచర్, బీరువాలు ఉన్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొంటున్నాయి. వీరితో ప్రస్తుత విభాగాధిపతులు, ఆచార్యులు ఇబ్బంది పడుతున్నారు. పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిని కలిసేందుకు వచ్చే విద్యార్థులు అభిప్రాయాలు పంచుకోవాలన్నా, సమస్యలపై చర్చించాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకడమిక్ కన్సల్టెంట్లు, గెస్ట్ ఫ్యాకల్టీ, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లోని ఆచార్యులు చాలావరకు ఒకేచోట కూర్చుంటున్నారు.

రెండేళ్లపాటు వెసులుబాటు?

సమస్యపై వర్సిటీ ఉన్నతాధికారులు ఇటీవల చర్చించినట్లు తెలిసింది. ఆచార్యుల పదవీ విరమణ అనంతరం రెండేళ్లపాటు పరిశోధక విద్యార్థుల మార్గదర్శనం కోసం వారికి కేటాయించిన గదుల్లో కొనసాగేలా, తర్వాత తప్పనిసరిగా వాటిని ఖాళీ చేసేలా చూడటంపై చర్చించారు. త్వరలో ఈ నిబంధన అమలు చేయనున్నట్లు చెబుతున్నారు.

ప్రత్యేకంగా ఏర్పాట్లున్నా..

విశ్వవిద్యాలయంలో విశ్రాంత ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఆచార్యుల కోసం ప్రత్యేకంగా వర్సిటీ ఆవరణలో కార్యాలయాలున్నాయి. ఇక్కడ కొందరు తరచూ కలుసుకుంటూ వివిధ అంశాలపై చర్చించుకుంటున్నారు. అలాంటప్పుడు విశ్రాంత ఉద్యోగులకు, ఆచార్యులకు ప్రత్యేక గదులు ఎందుకంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

రెవెన్యూ శాఖలో బదిలీలలు

కుర్చీ ఒకటి.. ఉద్యోగులు ఇద్దరు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: జిల్లాలో రెవెన్యూ శాఖ ఉద్యోగుల బదిలీలను కలెక్టరేట్ అధికారులు ఇష్టానుసారంగా చేశారన్న ఆరోపణలున్నాయి. ఒక పోస్టుకు ఇద్దరు ఉద్యోగులను నియమిస్తూ బదిలీ ఉత్తర్వులను కలెక్టరేట్ అధికారులు జారీ చేయడం గమనార్హం. కొన్నిచోట్ల ఒక స్థానంలో పని చేస్తున్న ఉద్యోగికి ఎక్కడా పోస్టింగ్ చూపకుండానే అక్కడకు వేరొక ప్రాంతం నుంచి మరో ఉద్యోగిని నియమించారు. ప్రభుత్వం ఆర్డీవో బదిలీల్లో సిఫార్సులను పక్కనపెట్టి నియామకాలు చేపట్టింది. అదే పద్ధతిలో జిల్లా రెవెన్యూ శాఖలో కలెక్టరేట్ అధికారులు చేపట్టకపోవడంతో గందరగోళం నెలకొంది.



సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయం

కొన్నింటిని పరిశీలిస్తే..

- సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ పరిధిలో ఒక ఎంఆర్ఐ పోస్టు ఉంది. అయితే ఇక్కడకు వాకాడు తహసీల్దార్ కార్యాలయం నుంచి శెల్వరాజ్‌ను, సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం నుంచి ఈ.రాజగోపాల్‌ను ఎంఆర్ఐలుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.
- ఓజిలి తహసీల్దార్ కార్యాలయంలో ఒక సీనియర్ సహాయకుడు పోస్టు మాత్రమే ఉంది. ఈ స్థానానికి కోట తహసీల్దార్ కార్యాలయం నుంచి కె.జనార్దన్‌ను, నెల్లూరు జిల్లా రాపూరు నుంచి సతీష్‌కుమార్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న ఆర్ఎస్‌డీటీని అక్కడ నుంచి బదిలీ చేయలేదు. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ చూపించినట్లు తాజా బదిలీల ఉత్తర్వుల్లో కనబరచలేదు. అయితే ఆయన స్థానంలో సూళ్లూరుపేటలో ఆర్ఎస్‌డీటీగా పనిచేస్తున్న కె.చైతన్యకుమార్‌ను బదిలీ చేశారు.
- సొంత మండలాల్లో, సొంత గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్వోలను బదిలీ చేయలేదు. వారిపై వివిధ ఆరోపణలు వచ్చినప్పటికీ ఆవైపు కన్నెత్తి చూడలేదు.

జిల్లా అటవీశాఖ అధికారిగా సెల్వం

మంగళం (తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి జి.సతీష్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్‌వోగా బదిలీ అయిన నేపథ్యంలో సోమవారం ఆయన రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ సెల్వం ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి ఇన్‌ఛార్జి సబ్ డీఎఫ్‌వోగా జూపార్కు అసిస్టెంట్ క్యూరేటర్ నాగభూషణం నియమితులయ్యారు.

దసరాకు కందిపప్పు కానుక

తిరుపతి (రెవెన్యూ), న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి కుటుంబాలకు దసరా కానుకగా రాష్ట్ర ప్రభుత్వం కందిపప్పు అందించేందుకు శ్రీకారం చుట్టింది. బియ్యం కార్డుదారులకు కిలో చొప్పున కందిపప్పు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని 1,457 చౌకదుకాణాల ద్వారా 5.89 లక్షల కార్డుదారులకు ఈనెల ఒకటి నుంచి కందిపప్పుతోపాటు బియ్యం, చక్కెర అందించనున్నారు.



గతంలో ఇచ్చుంటే ఒట్టు...

గత వైకాపా ప్రభుత్వం రాయితీపై కార్డుదారులకు అందించే కందిపప్పునకు మంగళం పాడింది. రాయితీ భారాన్ని భరించలేక కందిపప్పు సేకరణకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల ప్రక్రియను పూర్తిగా నిలిపివేసింది. వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండగలకు ఇవ్వకుండా మొండికేసింది.

నేటి నుంచి కార్డుదారులకు పంపిణీ

ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కందిపప్పు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించింది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కిలో రూ.150- 170 వరకు ఉండగా, రాయితీపై రూ.67కే అందించనుంది.

పూర్తిస్థాయిలో సరఫరా చేస్తాం

జిల్లాకు 289 టన్నుల కందిపప్పు అవసరం ఉంది. ప్రస్తుతం 110 టన్నులు అందుబాటులో ఉంది. మిలిగిన కోటా రెండు రోజుల్లో గోదాముకు చేరనుంది. నిర్దేశిత సమయానికి పంపిణీ పూర్తిస్థాయిలో సరఫరా చేస్తాం.

- సుమతి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్

సర్వదర్శనానికి 18 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి ఏటీసీ వరకు క్యూలైన్‌లో వేచిఉన్నారు. వీరికి దాదాపు 18 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని నాలుగు కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్నారు. వీరికి రెండు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. ఆదివారం శ్రీవారిని 84,066 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.4.02 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

జాతీయ ఉత్తమ పంచాయతీగా మోమిడి

చిల్లకూరు: స్వచ్ఛ భారత్‌లో భాగంగా చిల్లకూరు మండలం మోమిడి జాతీయ ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. మూడు రోజుల కిందట సీపీఆర్ (కమిషనర్ పంచాయతీరాజ్) విడుదల చేసిన జాబితాలో చోటు దక్కింది. కేంద్ర ప్రభుత్వ బృందాలు ఇటీవల నిర్వహించిన సర్వేలో మోమిడి పంచాయతీ ప్రజల సహకారంతో సర్పంచి లావణ్య, పూర్వ కార్యదర్శి రమాదేవి శుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తించింది. ఈ మేరకు జాతీయ స్థాయిలో అవార్డును ప్రకటించారు.



పక్షుల రక్షిత కేంద్రం ప్రారంభం నేడే


దొరవారిసత్రం: గూడ బాతుల సంతానోత్పత్తిలో దక్షిణాసియా ఖండలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు స్థానిక ఎఫ్ఎస్‌వో బాలయ్య సోమవారం తెలిపారు. మంగళవారం నుంచి సందర్శకులు తగిన రుసుం చెల్లించి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని సందర్శించవచ్చని తెలిపారు. ప్రస్తుతం తగినంత వర్షాలు లేకపోవడం వల్ల ముందుగా వచ్చిన నత్తగల్లకొంగలు, కొన్ని గూడ బాతులు మీజూరు, ఆటకానితిప్ప పరిసర ప్రాంతాల్లోని పులికాట్ సరస్సు ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి.

నేడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాక

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి హోదాలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలిసారిగా తిరుపతి పర్యటనకు మంగళవారం సాయంత్రం రానున్నారు. ఎన్నికల సమయంలో ప్రచార నిమిత్తం తిరుపతికి విచ్చేసిన ఆయన మళ్లీ ఇప్పుడే రానుండటంతో ప్రత్యేకత సంతరించుకుంది. పార్టీ నేతలు, కార్యకర్తలు, వీర మహిళలు ఘన స్వాగతం పలకనున్నారు. వాహన, బైక్ ర్యాలీలు రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుపతి వరకు నిర్వహించనున్నారు. బుధవారం తిరుమలలో స్వామివారిని దర్శించుకుని వారాహి దీక్షను విరమించనున్నారు. అనంతరం స్థానికంగా పర్యటించనున్నారు. గురువారం తిరుపతిలోని జ్యోతిరావు పులే కూడలిలో బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

రహదారి మారినా.. ప్రమాదాలు ఆగక

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన రోడ్డుగా మొగిలి ఘాట్ రికార్డులకెక్కుతోంది. 2019లో ఈ రోడ్డును నాలుగు లైన్లుగా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. నాడు డబుల్ రోడ్డుగా ఉన్న సమయంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. వాటిని నివారించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం చెన్నై నుంచి బెంగళూరు వరకు రోడ్డును విస్తరించి అభివృద్ధి చేసింది. రహదారిని విస్తరించినా ప్రమాదాలు మాత్రం తగ్గలేదు. 15 రోజుల వ్యవధిలో మూడు ఘోర ప్రమాదాలు సంభవించాయి. ఈ ప్రమాదాల్లో 12 మంది మృత్యువాత పడగా 40 మంది గాయపడ్డారు. మూడు ప్రమాదాలు మొగిలి ఘాట్ మలుపు వద్దే చోటు చేసుకోవడం గమనార్హం. రహదారి భద్రత అనలిస్టు బాలాజీ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు ఇటీవల ప్రమాదాలపై సర్వే నిర్వహించారు. నివారణ కోసం మరో 10 రోజుల్లో తగు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.



ప్రస్తుతం ఇలా..



నాడు మొగిలి ఘాట్ రోడ్డు మలుపు (పాత చిత్రం)

మారని మలుపు

సాధారణంగా నాలుగు లైన్ల రోడ్ల విస్తరణలో భాగంగా అధికారులు, ఇంజినీర్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్న మలుపులను తగ్గించడానికి యత్నిస్తారు. మలుపులు, పల్లంలేని రోడ్డును నిర్మించి అప్పటి వరకు చోటు చేసుకున్న ప్రమాదాలను పరిగణనలోకి తీసుకుని నివారించడానికి చర్యలు తీసుకుంటారు. మొగిలి ఘాట్ రోడ్డు 1916లో ఎలా ఉందో.. రహదారి విస్తరణ చేపట్టినా ఎలాంటి మార్పు లేదు. రెండు వరుసల రహదారి నాలుగు వరుసలుగా మారింది. ఈ విషయాన్ని ఇటీవల సర్వే చేసిన అనలిస్టు బాలాజీ వెలిబుచ్చారు. ప్రస్తుతం ఈ మలుపు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ మలుపును తగ్గించడం ఏమాత్రం వీలుకాదని, వాహన చోదకులను అప్రమత్తం చేసే విధంగా రోడ్డుమీద ఏర్పాట్లు చేయడానికి అధికారులు సిద్ధపడుతున్నారు.

ఆతిథ్య రంగంలో ఉపాధి అవకాశాలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి పురస్కారాలు అందుకున్న ప్రతినిధులతో కలెక్టర్ డా.వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్ తదితరులు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: పర్యాటక, ఆతిథ్య రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి పర్యాటక, హోటల్ రంగంలో అత్యుత్తమ సేవలకుగాను జిల్లా నుంచి ఐదు పురస్కారాలు అందుకున్న సంస్థల ప్రతినిధులను సోమవారం కలెక్టరేట్‌లో ఆయన అభినందించారు. జేసీ శుభం భన్సల్, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు డా.రమణప్రసాద్, డీఆర్వో పెంచల కిషోర్, జిల్లా పర్యాటకశాఖ అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయుష్మాన్ భారత్ గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. వార్షికోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ వైద్యసేవలు అందిస్తున్న ఆసుపత్రుల్లో ఉచితంగా ఓపీ సేవలు అందించినట్లు చెప్పారు. డీఎంహెచ్‌వో డా.శ్రీహరి, ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ రాజశేఖర్, మేనేజర్ శివకుమార్, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, చిత్రంలో జేఈవో వీరబ్రహ్మం తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఈ నెల 8న గరుడసేవను తిలకించడానికి వచ్చే అసంఖ్యాక భక్తులను వాహన సేవ అనంతరం సురక్షితంగా తరలించేందుకు తితిదే ఎవాక్యుయేషన్ కమిటీని ఏర్పాటుచేసింది. ఇదే విషయాన్ని సోమవారం సాయంత్రం తిరుమలలోని స్థానిక అన్నమయ్య భవనంలో జరిగిన సమీక్షలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి వెల్లడించారు. ఈ నెల 9న గరుడసేవ దర్శనం పూర్తయిన తరువాత నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లోని భక్తులను సురక్షితంగా వారి సమీప బస్టాండ్ ప్రదేశాలను చేరుకునేందుకు వీలుగా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను సూచించారు. అనంతరం సాంస్కృతిక కళాబృందాల కార్యక్రమాలపై ఆయన చర్చించారు. సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, జీఎం ట్రాన్స్‌పోర్ట్ శేషారెడ్డి, డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, రామ్‌కుమార్, గోశాల డీడీ హరినాథ్‌రెడ్డి, ఆల్‌హిందూ ధర్మ ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.





డ్రాగన్ పండు ఆదాయం మెండు

పుంగనూరు, కల్లూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. మూస పద్ధతిలో సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలుకుతున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. చిత్తూరు జిల్లాలోనూ వియత్నం, థాయ్‌లాండ్, శ్రీలంక దేశాల్లో పండించే డ్రాగన్ ఫ్రూట్‌ను సాగుచేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లె పంచాయతీ ఎర్రవాండ్లపల్లెకు చెందిన యువరైతు చంద్రశేఖర్ మూడు ఎకరాల్లో డ్రాగన్ సాగు చేస్తున్నారు. సోమల మండలం దాసరివారిపల్లెలో రైతు సాంబయ్య సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు.

సస్యరక్షణపై దృష్టి సారించాలి

తోటలో దిగుబడులు మొదలైనా సస్యరక్షణపై మరింత దృష్టి సారించాలి. సస్యరక్షణ చర్యలు తీసుకుంటే 20ఏళ్ల వరకూ దిగుబడులు వస్తూనే ఉంటాయి. మొదటి ఏడాది రెండు టన్నులు నుంచి నాలుగో ఏడాదిలో 4.



అధిక ఆదాయం

నాకున్న మూడెకరాల్లో డ్రాగన్ పండు సాగు చేస్తున్నా. ఎకరాకు 4000 మొక్కలు నాటాను. రూ.8లక్షలు పెట్టుబడి అయింది. గుంటూరు కుద్రేలా ఆగ్రో పామ్ నుంచి రవాణా ఖర్చుతో కలిపి మొక్క రూ.65 లతో 4000 మొక్కలు కొనుగోలు చేశాను. మొక్కలకు రూ.2.60లక్షలు అయింది. పదికి పది అడుగుల దూరంలో రాతి కూసాలు నాటి సాగు చేశాను. సూక్ష్మ సేద్యం ద్వారా పంటకు నీరు అందించాను. ఎకరాకు 8 టన్నుల దిగుబడి రాగా, రెండవ, మూడవ తదితర ప్రాంతాల్లో కిలో రూ.120 నుంచి 150 వరకు విక్రయించాను. ఇప్పటి వరకు రూ.8లక్షలు వచ్చింది. మూడో సంవత్సరం మంచి లాభాలు ఆర్జించవచ్చు.

- చంద్రశేఖర్, యువరైతు, ఎర్రవాండ్లపల్లె

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్

ప్రశ్న: రబీ సీజన్‌లో వరి విత్తనం నాటే ముందు విత్తశుద్ధి ఏ మందుతో ఎలా చేసుకోవాలి?

- మల్లికార్జున, ఆర్.మల్లవరం, రేణిగుంట మండలం

జవాబు: రబీ సీజన్‌లో విత్తనాన్ని సేకరించిన తర్వాత మొదట 24 గంటలు దాన్ని నానబెట్టాలి. తాలు గింజలను ఏరివేయాలి. ఒక కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండిజమ్ మాంకోజెబ్ సిలింద్రియాన్ని కలుపుకొని మంచి విత్తనంలో వేయాలి. 24 గంటలు విత్తనాన్ని మండెకట్టిన తరువాత పొలంలో చల్లుకుంటే 15 నుంచి 20 రోజుల వరకు ఎటువంటి తెగుళ్లు రాకుండా మొక్క ఆరోగ్యంగా పెరుగుతుంది.

రైతేరాజు

5టన్నుల దిగుబడులు పెరుగుతూ వస్తున్నాయి. ఒక్కో కాయ 350 నుంచి 500గ్రాముల వరకు ఉంటోంది. బెంగళూరు, చెన్నై, తిరుపతిలలో విక్రయిస్తున్నారు. కొన్నిసార్లు తోట దగ్గరకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మరో ఎకరాలో నాటాలని ప్రయత్నిస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం దూరం

వర్షాకాలంలో మూగజీవాల సంరక్షణలో అలక్ష్యం చేయకుండా సంరక్షించుకోవడం పశుపోషకుల ముఖ్య కర్తవ్యమని శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్.వి.శ్రీకాంత్‌బాబు తెలిపారు. వరదలు, తుపాను సంభవించిన పుడు పశుపోషకులు ఈ తరహా జాగ్రత్తలు పాటిస్తే ప్రాణనష్టం, వ్యాధుల బారిన పడకుండా సంరక్షించుకోవచ్చునని తెలిపారు. ▶ పశువులకు ఇచ్చే నీటిని బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్ర పరచాలి. ▶ పశువుల పాకలను తేలిక పాటి ఆకులు, కొబ్బరి మట్టలు తదితర వాటితో వేసుకుంటే గాలి తీవ్రతకు అవి కూలిపోయినా పెద్దగా నష్టం ఉండదు. ▶ బాహ్య పరాన్నజీవుల నిర్మూలనకు వైద్యుల సూచనల మేరకు క్రిమి సంహారక మందులు పిచికారి చేయాలి. ▶ నిల్వ ఉన్న నీటిలో దోమలు, ఈగలు పెరిగే ప్రమాదముంది. తద్వారా వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువ. అలాంటి పరిస్థితులు లేకుండా జాగ్రత్త పడాలి. వీలైనంత వరకు పశువులు ఉన్న ప్రదేశంలో నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ చూపాలి. ▶ రోగ నిరోధక శక్తి తగ్గి పశువులు వ్యాధులకు గురయ్యే అవకాశముంది. పశువుల్లో వచ్చే అనారోగ్య సమస్యలను గుర్తించి అప్పటికప్పుడు వైద్య సాయం అందించాల్సి ఉంటుంది. ▶ సీజనల్ వ్యాధుల నివారణకు విధిగా టీకాలు వేయించాలి. ▶ ప్రమాదంగా దాణా జబ్బుడులు లేకుండా వర్షాకాలంలో ముందస్తుగా దాచుకోవడం శ్రేయస్కరం.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వంగ ఇలా చేస్తే ఉండదిక బెంగ

పుత్తూరు, న్యూస్‌టుడే: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రైతులు వంగ పంట విస్తారంగా సాగు చేశారు. వివిధ రకాల తెగుళ్లు, పురుగులు ఆశించి పైరు ఎదుగుదల, దిగుబడిని దెబ్బతీస్తున్నాయి. వీటి నివారణకు పుత్తూరు ఉద్యానశాఖాధికారి వెంకటసౌజన్య పలు సూచనలు చేశారు.

అధిక దిగుబడులు పొందాలంటే..

మేలు సంకర జాతి రకాలను ఎంచుకోవాలి. పురుగు ఆశించిన కాయలను, కొమ్మలను తుంచి నాశనం చేయాలి. అంతర పంటగా బంతి, ఉల్లి, వెల్లుల్లి పంటలు సాగు చేసుకుంటే మంచిది. లింగాకర్షక బుట్టలను ఎకరాకు నాలుగు చొప్పున ఏర్పాటు చేయాలి. తలనత్త పురుగులు ఆశించిన ప్రాంతం నుంచి ఒక అంగుళం కిందకు తుంచి నాశనం చేయాలి. బైక్లోర్గాలా బదులకూను ఎక రాకు 20వేల విడుదల చేయాలి. బీటీ మందులను లీటరు నీటికి గ్రాము చొప్పున కలిపి పూత దశలో పిచికారీ చేయాలి. ఎకరాకు 200 కిలోల చొప్పున వేపపిండిని దుక్కిలో వేయాలి. బ్యాక్టీరియా ఎండు తెగులు ఉన్న ప్రాంతాల్లో ఎకరాకు 6 కిలోల చొప్పున బ్లీచింగ్ పొడి మందును వేసుకోవాలి. వంగ పెరుగుదల దశలో 1-2 శాతం యూరియా ద్రావణం(లీటరు నీటికి 10-20 గ్రాములు) పిచికారీ చేస్తే అధిక పంట దిగుబడితో పాటు 20శాతం నత్రజని ఆదా అవుతుంది. పూత, కోత దశలలో 24-డి(లీటరు నీటికి 10 మి.గ్రా, లేదా ప్లానోఫిక్స్ 2.5మి.లీ/ 10 లీటర్ల నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు మంచి దిగుబడి పొందవచ్చు.



జెండా పండగకు ముమ్మర ఏర్పాట్లు



ఆంజనేయస్వామి చిత్రం గీస్తున్న కళాకారుడు చిన్నా

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలకు దేశంలో ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ ఉత్సవాల పేరు వినగానే ముందుగా గుర్తొచ్చేది మైసూరు. ఆ తర్వాత దసరా ఉత్సవాలను, జెండా మహోత్సవాన్ని రాష్ట్రంలో గూడూరులో మాత్రమే నిర్వహిస్తారు. ఏటా మహాలయ అమావాస్య రోజున జెండా ఉత్సవాలను ఆరంభ పూజ సుమారు నిర్వహించడంతో పాటు పట్టణ ప్రజలు

2న గూడూరులో ఉత్సవం

సుభిక్షంగా ఉండాలంటూ ఆంజనేయస్వామి రూపంతో కూడిన చిత్రాన్ని ఊరేగిస్తారు.

గూడూరులో నిర్వహించే జెండా ఉత్సవాలకు ఏళ్ల చరిత్ర ఉంది. కరవు కాటకాల నుంచి బయట పడేందుకు జెండా పండుగను నిర్వహిస్తున్నట్లు చరిత్ర చెబుతోంది. 1948 నుంచి గూడూరులో జెండా ఉత్సవానికి తెరతీసినట్లు స్థానిక పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో గూడూరు ప్రాంతంలో అంటువ్యాధులు, కలరా వ్యాప్తి చెందడంతో గ్రామ పెద్దలు ఆంజనేయస్వామికి మొక్కుకున్నారు. దీంతో గూడూరు ప్రశాంతతో పాటు, సుభిక్షంగా అభివృద్ధి చెందింది. అప్పటి నుంచి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జెండా పండగకు ఇతర ప్రాంతాల్లో ఉన్న స్థానికులు కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులతో మొక్కులు తీర్చుకోవడానికి గూడూరు చేరుకుంటారు. దసరా ఉత్సవాలకు పది రోజులు ముందుగా



విద్యుద్దీపాల వెలుగులో ఆలయం

పట్టణ వీధుల్లో ఆంజనేయస్వామి జెండాలను యువత పెద్ద ఊరేగిస్తారు. విద్యుద్దీపాలతో పట్టణాన్ని ప్రత్యేకంగా అలంకరిస్తారు.

ఎక్కడెక్కడంటే..

గూడూరులో నిర్వహించే జెండా ఉత్సవానికి నిర్వాహకులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పువీధి, కల్లాలవీధి, గమళ్లపాళెం, కోనేటిమిట్ట, కుమ్మరివీధి, జడ్పీ స్కూల్ రోడ్డు, నల్లజాలమ్మవీధి, అశోక్‌నగర్, సౌసైటీ, రైతుబజారు సెంటరు, రెండో పట్టణంలోని సిరామిక్‌రోడ్డు, మహత్ముల మ్మగుడి, మాళవ్యానగర్, నరసింగరావుపేట తదితర ప్రాంతాల్లో జెండా మహోత్సవానికి సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. జెండా పండగ రోజున పట్టణంలోని ప్రధానంగా అమ్మవారి ఆలయాల్లో కలశాలు ఏర్పాటు చేస్తారు. నారాయణమ్మ, మహాలక్ష్మమ్మ, రాజరాజేశ్వరి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో 9రోజుల పాటు 9 రూపాల్లో అమ్మవారికి పూజలు చేస్తారు. దసరా రోజు భారీ ఊరేగింపులు, గ్రామోత్సవాలు నిర్వహిస్తారు.



శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని వస్తున్న పర్యాటకశాఖ అధికారులు

నేటి నుంచి గుడిమల్లంకు పర్యాటక బస్సులు

ఏర్పేడు, న్యూస్‌టుడే: గుడిమల్లంలో వెలసిన శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయానికి పర్యాటక బస్సులు నడపనున్నట్లు పర్యాటక శాఖ డివిజనల్ మేనేజరు గిరిధర్ తెలిపారు. దీనిపై ఆలయ అధికారులు జిల్లాలోనే ఉన్నతాధికారులకు విన్నవించడంతో సోమవారం పర్యాటకశాఖ బృందం ఆలయాన్ని పరిశీలించి ఆమోదం తెలిపారు. డ్రైవర్ గిరినాయుడు, ప్రవీణ్, రాజశేఖర్‌నాయుడు, పద్మనాభనాయుడు పాల్గొన్నారు.

'తితిదేని రాజకీయాలకు వాడుకుంటున్నారు'

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీవారి లడ్డూల విషయాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ విమర్శించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సుప్రీం ధర్మాసనం తితిదేలో జరిగిన కల్తీ నెయ్యి గురించి అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర ప్రభుత్వ తరఫున న్యాయవాది సమాధానం చెప్పలేకపోయారని, సున్నితమైన అంశంపై సీఎం చంద్రబాబు తొందరపడ్డారని, తితిదే ఈవో అత్యుత్సాహాన్ని ప్రదర్శించారన్నారు. వందరోజుల పరిపాలనలో ఏమి సాధించారని, మహిళలు ఉచిత బస్సుల వైపు ఆశగా చూస్తున్నారన్నారు. తితిదే ఉద్యోగులకు నోటీసుల ఇవ్వడం మంచిది కాదని, బోర్డు నిర్ణయాలు మాత్రమే వారు అమలు చేస్తున్నారన్నారు. తిరుపతిలో పోలీసు వ్యవస్థ భ్రష్టుపట్టిందని, జగన్ రాకతో పోలీస్ యాక్టు 30ని నెలరోజులు అమలు చేస్తున్నామని ఎస్పీ ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతిలో ఎన్నడూ లేనివిధంగా ఫెక్సీలు ఏర్పాటు చేయడం తప్పుపట్టారు. యాదల్లి గోపి గౌడ్, అబ్దుల్ మజీద్ పటేల్, తేజోవతి, మునిశోభ పాల్గొన్నారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో జీపు ప్రమాదం



జీపు పక్కన క్షతగాత్రులు: (ప్రమాదానికి గురైన కారు (వృత్తంలో)

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల రెండో ఘాట్ రోడ్డులోని చివరి మలుపు వద్ద డ్రైవరు జీపు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొని అటవీప్రాంతంలోకి దూసుకెళ్లిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి చెందిన భక్తులు శ్రీవారి దర్శించుకుని మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా జీపులో వస్తుండగా ఆఖరి మలుపు వద్ద అదుపుతప్పి రక్షణగోడను ఢీకొని అటవీప్రాంతంలోకి వెళ్లి చెట్టును ఢీకొని ఆగిపోయింది. ఈ ప్రమాదంలో కల్యాణసుందరం, మంజుల, ప్రియ గాయపడ్డారు. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన జీపును పక్కకు తొలగించారు. క్షతగాత్రులను రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 187 వినతులు

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 187 వినతులు వచ్చినట్లు కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జేసీ శుభం భన్సల్, డీఆర్వో పెంచల కిషోర్, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు నరసింహులు, దేవేందర్‌రెడ్డితో కలిసి వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి అత్యధికంగా 120 వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

సీపీఆర్‌తో ప్రాణరక్షణ..

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో పనిచేస్తున్న తితిదే విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది, ఆలయ సిబ్బందికి కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై వైద్యులు శిక్షణ అందించారు. స్థానిక అశ్విని ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డా.ఎస్.కుసుమకుమారి ఆధ్వర్యంలో రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. భక్తులు ఎక్కడైనా కుప్పకూలిపోతే వెంటనే సీపీఆర్ చేసి వారి ప్రాణాలను రక్షించడంతోపాటు సకాలంలో ఆసుపత్రికి చేరుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

గ్రామీణస్థాయిలో ఎన్‌సీసీ విస్తరణకు చర్యలు

తిరుపతి (నగరపాలిక): తిరుపతి కేంద్రంగా ఎన్‌సీసీ శిక్షణ అకాడమీ ఏర్పాటు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్నట్లు డైరెక్టర్ జనరల్ గుర్బీర్‌పాల్ సింగ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పర్యటనలో భాగంగా ఆయన సోమవారం తిరుపతిలోని ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉన్నతాధికారులు వి.ఎం.రెడ్డి, సతీందర్ దహియా ఆయనకు స్వాగతం పలకగా ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవవందనం సమర్పించారు. గుర్బీర్‌పాల్ సింగ్ మాట్లాడుతూ ఎన్‌సీసీని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. అమరావతిలో ఎన్‌సీసీ డైరెక్టరేట్ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి కోరినట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా బెటాలియన్ల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు వివరించారు.

తితిదేకు టీవీఎస్ విద్యుత్తు బైక్‌ల వితరణ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ప్రముఖ మోటార్ కంపెనీ టీవీఎస్ సంస్థ తితిదేకు రూ.16 లక్షల విలువచేసే పది ఐ క్యూబ్ ఎలక్ట్రిక్ బ్యాటరీ వాహనాలను అందజేసింది. సంబంధిత పత్రాలను దేవస్థానం రవాణా విభాగం జనరల్ మేనేజర్ శేషారెడ్డికి తిరుపతిలోని శ్రీనివాస సంస్థ యజమానులు పి.భక్తవత్సలం, పీఆర్ సిద్ధార్థ సోమవారం అందజేశారు.



జీఎం శేషారెడ్డికి వాహనాల పత్రాలు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

సైన్స్ సెంటర్‌లో క్రియేటివ్ ఎబిలిటీ కోర్స్

జీవకోన(తిరుపతి): తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో దసరా సెలవుల పురస్కరించుకుని విద్యార్థులకు క్రియేటివ్ ఎబిలిటీ కోర్సు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డిగారా ఒక ప్రకటనలో తెలిపారు. పోర్ట్ ఫర్ట్ లైట్, పండమెంటల్స్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ పేరుతో యాక్టివిటీ ఆధారిత కోర్సులను అందిస్తున్నామని, 5, 6, 7 తరగతుల విద్యార్థులు చేరవచ్చునని తెలిపారు. అక్టోబరు 5 నుంచి 11 వరకు కోర్సు ఉంటుందని, ఆసక్తిగల విద్యార్థులు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు సైన్స్ సెంటర్ 0877-2286202/203 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు	
బ్రాయిలర్ (రైతు ధర)	115
రిటైల్	137
లేయర్	115
బ్రాయిలర్స్	199
బ్రాయిలర్ స్కిన్ లెస్	226
లేయర్ మాంసం	195

కనిపిస్తున్నా.. కనిపించనట్లు..!

ఇసుక అక్రమ రవాణా పట్టించుకోని పోలీసులు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు నుంచి పదుల సంఖ్యలో ఇసుక ట్రాక్టర్లు నిత్యం రాకపోకలు సాగిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. సూళ్లూరుపేట మండలం ఇలుపూరు సమీపంలో కాళంగి నది నుంచి టైరు బండ్లలో ఇసుకను తరలించి పరిసర ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం పోలీసులకు తెలిసినా పట్టించుకోకపోవడం గమనార్హం. ● ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో సూళ్లూరుపేట వద్ద జాతీయ రహదారిపై హెడ్ కానిస్టేబుల్‌తోపాటు మరికొందరు పోలీసులు ఉన్నారు. ఆ సమయంలో ఇలుపూరు నుంచి మూడు ట్రాక్టర్లు ఇసుకతో ఆ మార్గంలోనే వచ్చాయి. కానీ పోలీసులు వాటి జోలికి వెళ్లలేదు.

నిఘా దారి తప్పి

నియోజకవర్గంలోని జాతీయ రహదారి పరిధిలో రాత్రిపూట గస్తీ నిర్వహించడానికి పోలీసు అధికారులు, సిబ్బందికి రోజూ వారీ విధులు కేటాయిస్తున్నారు. వీరు ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాతోపాటు, ఇతర వాటిపై నిఘా ఉంచి దాడులు చేయాలి. కానీ ఈ విధులకు వచ్చే వారు గస్తీని పక్కన పెట్టి పిండిపాళెం వద్ద ఉన్న సినిమా థియేటర్లలో ఉంటున్నారు.

ఈఎస్‌గా నాగమల్లేశ్వరరెడ్డి బాధ్యతల స్వీకరణ

తిరుపతి (నేరవిభాగం),: ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ తిరుపతి జిల్లా సూపరింటెండెంట్‌గా నాగమల్లేశ్వరరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2018 బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో అసిస్టెంట్ ఈఎస్‌గా విధుల్లో చేరారు. అనంతపురం, సింగరాయకొండ, రాజమండ్రి ప్రాంతాల్లో పనిచేశారు. ఈ ఏడాది జనవరిలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతి పొందారు. నెల్లూరులో పనిచేస్తున్న ఆయన్ను తిరుపతి ఈఎస్‌గా ప్రభుత్వం బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు.

నాలుగు ఆపరేషన్ సర్కిళ్లలో అదనపు పోస్టులు మంజూరు

తిరుపతి (నగరం): ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఐదేళ్ల కొత్తగా చిత్తూరు, రాయచోటి, నంద్యాల, పుట్టపర్తి ఆపరేషన్ సర్కిళ్లు ఏర్పాటు చేయగా వాటికి అదనపు పోస్టులు మంజూరు చేశారు. 16 మంది ఈఈలు, నలుగురు ఆకౌంట్స్ అధికారులు, నలుగురు సహాయ అకౌంట్స్ అధికారులు, నలుగురు పర్సనల్ అఫిసర్లను నియమిస్తూ సంస్థ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులు జారీ చేశారు. జీఎంగా పనిచేస్తున్న పద్మజాను శిక్షణ వ్యవహారాల సీజీఎంగాను, ఈఈగా పనిచేస్తున్న రజనీకాంత్‌రెడ్డిని పదోన్నతిపై కార్పొరేట్ కార్యాలయంలో జీఎంగా, డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న వేణుగోపాల్‌కు ఈఈగా పదోన్నతి కల్పించి సీఎండీ కార్యాలయంలో నియమించారు. డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న బాబును పదోన్నతిపై కార్పొరేట్ కార్యాలయంలో ఈఈగా నియమించారు.


అంతర్రాష్ట్ర మహిళా దొంగల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ పరిధిలో ఒకే రాత్రి మూడిళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర మహిళా దొంగలను అరెస్టు చేసినట్లు చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. సోమవారం వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఒకటేరుకు మూడు ఇళ్లలో దొంగలు పడ్డారు. రూ.29 లక్షల విలువైన బంగారు, వెండి, నగదు దోచారు. మరునాడే సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి నాలుగు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేశారు. సోమవారం మధ్యాహ్నం రామానుజపల్లి చెక్‌పోస్టు వద్ద హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్‌కు చెందిన శెట్టి లక్ష్మి (40), శెట్టి మీనా (29)లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.37 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల భర్తలు విజయ్, మణి.. కుడుకురు, రావులపాలెంలో చోరీలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించారు. వారితో కలిసి 2022లో చెన్నైలోని ఈరోడ్డులో దొంగతనాలకు పాల్పడిన మహిళా జైలుకు వెళ్లారు. విజయ్, మణి, బంధువులను అరెస్టు చేయాల్సి ఉందని డీఎస్పీ వెల్లడించారు.

గురుకుల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

సకాలంలో చికిత్స అందక ప్రాణాపాయ స్థితిలోకి

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నగరంలోని స్థానిక అంబేడ్కర్ గురుకుల విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది. సకాలంలో చికిత్స అందించకపోవడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లింది. బంధు ప్రకారం.. చెందిన సుస్మిత కళ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఐదు రోజుల క్రితం జ్వరం రావడంతో నిర్వాహకులు ఆ విద్యార్థిని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా కుదుటపడక పోవడంతో విషయం తెలుసుకున్న సుస్మిత కుటుంబ సభ్యులు ఆమెను ఇంటికి తీసుకెళ్లారు. ఫిట్స్ రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వెంటిలేటర్ సాయంతో అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం తిరుపతి నుంచి తమిళనాడులోని వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. సకాలంలో సరైన చికిత్స అందించకపోవడంతోనే పరిస్థితి విషమించిందని, పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగినట్లు సుస్మిత సమీప బంధువు కృష్ణమూర్తి ఆరోపించారు. గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త పద్మజ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ తమ నిర్లక్ష్యం లేదని, తాము సకాలంలో స్పందించి ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు స్పష్టం చేశారు.



వెంటిలేటర్‌పై సుస్మిత

స్విమ్స్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ యూనివర్సిటీలో నూతన విద్యా సంవత్సరానికిగాను పలు పీజీ కోర్సుల్లో రెండో విడత కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్.బిట్ల ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబరు 4న హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంఎస్సీ (నర్సింగ్) 19, ఎంఎస్సీ క్లినికల్ వైరాలజీ 1, ఎంఎస్సీ కార్డియాక్ కాథెటరైజేషన్ ఇంటర్వెన్షన్ టెక్నాలజీ 1, ఎంఎస్సీ కార్డియో పల్మనరీ పర్ఫ్యూషన్ టెక్నాలజీ 2, మెడికల్ రికార్డ్ సైన్స్ 07, డిప్లొమా ఇన్ నర్సింగ్ ఏహెచ్‌ఎస్, పీజీ డిప్లొమా ఇన్ నర్సింగ్ ప్రోగ్రామ్ 23 ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు.

42 గ్రాముల బంగారం స్వాధీనం.. నాగలాపురం: మహిళల మెడలో బంగారు గొలుసులను చోరీచేసిన దొంగను అరెస్టు చేసినట్లు సీఐ బాష్యాన్నాయక్ తెలిపారు. పిచ్చాటూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగలాపురం మండలం నాదలోని తిరుత్తణికి సమీపంలో కాశీనాథపురానికి చెందిన సూర్య (23) తన స్నేహితులతో కలసి గొలుసు దొంగతనాలకు పాల్పడేవాడు. ఇదే క్రమంలో నాగలాపురం మండలం వడ్డిపాళెం, పిచ్చాటూరు మండలం అప్పలాయగుంట(కగిరిలో) వృద్ధురాళ్ల మెడలోని గొలుసులు జూలైలో చోరీ చేశారు. ఈ కేసును దర్యాప్తు చేసిన నాగలాపురం, పిచ్చాటూరు పోలీసులు నిందితుడిని సోమవారం పన్నూరు ఉపకేంద్రం వద్ద అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించడంతో పాటు అతని వద్ద 42 గ్రాముల బరువైన రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్ పాల్గొన్నారు.

3.35 టన్నుల చౌక బియ్యం పట్టివేత.. దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని పోలిరెడ్డిపాళెం సమీపంలోని జాతీయ రహదారిపై మినీవ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 3.35 టన్నుల తమిళనాడు రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, పౌర సరఫరా అధికారులు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని వాహనంతోపాటు డ్రైవర్ రాజశేఖర్‌ను పోలీసుకు అప్పగించారు. విజిలెన్స్ ఎస్సై ఎం.రామకృష్ణనాయక్, సీఎస్‌డీటీ ఓబయ్య పాల్గొన్నారు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

దేవీ నవరాత్రులకు విస్తృత ఏర్పాట్లు

చంద్రగిరి, న్యూస్‌టుడే: చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ దేవస్థానంలో 3 నుంచి 12 వరకు దేవీనవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 3న కలశస్థాపన, 4న శ్రీలక్ష్మీదేవి అలంకరణ, 5న గజలక్ష్మీదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న గరుడవాహనంపై నారాయణి స్వరూపం, 8న సరస్వతీదేవి స్వరూపం, 9న గాయత్రీదేవి, 10న రాజరాజేశ్వరి, 11న పూలతేరుపై దుర్గాదేవి, 12న పుష్పపల్లకీలో మహిషాసుర మర్దిని స్వరూపంతో అమ్మవారు భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. తొండవాడ పంచాయతీలోని శ్రీఉగ్రప్రత్యాంగిరాదేవి దేవాలయంలో తొమ్మిది రోజుల పాటు యజ్ఞ హోమాలు, వివిధ స్వరూపాలతో అమ్మవారిని అలంకరించనున్నారు.

21లోపు డిగ్రీ పరీక్షల రుసుం చెల్లించాలి

తిరుపతి (బైరాగిపట్టెడ): ఎస్వీయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు 1,3, 5 సెమిస్టర్లకు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లించేందుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం నియంత్రణ అధికారి దామ్లా నాయక్ తెలిపారు. పరీక్ష రుసుం ఈనెల 21 లోపు చెల్లించాలని, అపరాధ రుసుంతో 31వ తేదీ లోపు చెల్లించవచ్చన్నారు.

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:
సమస్య: కె.టి.రోడ్డు డిఫెన్స్ కాలనీలో ఇంటి నెంబరు 6-9-1376/ఇ వద్ద స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు. రోడ్డు చివరలో చీకటిగా ఉంటోంది.
- టి.ఉషా, డిఫెన్స్‌కాలనీ
సమాధానం: సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడుతాం.
- ఎస్ఈ, నగరపాలిక కార్యాలయం

రాయలపురంలో మురుగు తొలగింపు

స్పందనకు వందనం

చంద్రగిరి: రాయలపురం పంచాయతీలో మురుగునీటి కాల్వలను అధికారులు జేసీబీ యంత్రాలు, పారిశుద్ధ్య కార్మికులతో గ్రామ పంచాయతీ కార్యదర్శి అనూరాధ యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయించారు. ఇక్కడి కాల్వల దుస్థితిపై సోమవారం 'ఈనాడు' దినపత్రికలో 'రాయలపురం.. మురుగు కూపం' శీర్షికతో కథనం ప్రచురితమైంది.

తాగునీటి పైపులైన్ మార్పు

చంద్రగిరి గ్రామీణ: ఎ.రంగంపేట పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణ వీధిలో తాగునీటి పైప్ మార్చారు. రంధ్రం పడి తాగునీరు వృథా అవుతుండటంపై సోమవారం 'మేమున్నాం... మీకు తోడుగా' శీర్షికన రావడంతో గ్రామ కార్యదర్శి శిరీష స్పందించి లీకేజీలను అరికట్టారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


శ్రీవారి ఆలయం ఎదుట ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ కేసరి అప్పారావు, కమిషన్ సభ్యులు త్రిపర్ణ ఆదిలక్ష్మి, పద్మావతి తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ కేసరి అప్పారావు, కమిషన్ సభ్యులు త్రిపర్ణ ఆదిలక్ష్మి, పద్మావతి సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని వారు దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. వీరితోపాటు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, డీసీపీవో శివశంకర్ ఉన్నారు.

నైతిక విలువలందించడం గురువుల బాధ్యత


కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు

మహిళా వర్సిటీ(తిరుపతి): విద్యార్థులకు విజ్ఞానంతోపాటు నైతిక విలువలు అందించడం గురువుల బాధ్యతని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వి.ఉమ అన్నారు. మహిళా వర్సిటీ, సీబీఎస్ఈ సంయుక్త ఆధ్వర్యంలో సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాళ్లకు జాతీయస్థాయి ఎక్స్‌పోజర్ విజిట్ రెండురోజుల కార్యక్రమాన్ని సోమవారం వర్సిటీ సావేరి సమావేశ మందిరంలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ మాట్లాడుతూ ప్రవేశం, సమానత్వం, నాణ్యత, అందుబాటు, బాధ్యత అనే ఐదు ప్రధాన సూత్రాలతో రూపుదిద్దుకున్న జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)2020 భవిష్యత్తులో జాతీయ, ప్రపంచ స్థాయి సవాళ్లను ఎదుర్కొనే విధంగా యువ మేధావులను సంసిద్ధం చేస్తుందని చెప్పారు. రిజిస్ట్రార్ రజని, సీబీఎస్ఈ నైపుణ్య విభాగం కార్యదర్శి రాజీవ్‌పాండే, సమన్వయకర్త ఆచార్య అముదవల్లి మాట్లాడారు. డీన్లు సుజాత, వాణి పాల్గొన్నారు.

నేడు 'ప్రపంచ వృద్ధుల దినోత్సవం'


మదినిండా కలత
కదిపితే కడలి వ్యథ

పిల్లలే లోకంగా వారి ఉన్నతే లక్ష్యంగా తమ సర్వస్వం ధారపోస్తారు కన్నవారు. కడుపులో ఓ నలుసు పడిందని తెలిసినప్పటి నుంచే కలలు కంటారు. వాటికో రూపమిచ్చి సాకారం కోసం అహరహం శ్రమిస్తారు. అలాంటి తల్లిదండ్రులకు పిల్లలిచ్చే గొప్ప బహుమతి వాళ్లకు 60 ఏళ్లు నిండగానే ఓ భద్రమైన జీవితం కల్పించడం. కానీ ఎన్నో ప్రాణాలు ఒంటరి వేదనతో కొట్టుమిట్టాడుతున్నాయి. వృద్ధాశ్రమాల్లో రోజులు లెక్కబెడుతున్నాయి. ఈ ఆయువు ఆగేలోపు ఒక్కసారి వచ్చి బిడ్డ పలకరించినా చాలని తల్లడిల్లే ప్రాణాలకు లెక్కలేదు. రేపు ఇదే గతి తమకు పట్టకూడదని ప్రతిబిడ్డా ఆలోచిస్తే చిక్కుముళ్లు విడిపోతాయి. అంతరం చెరిగిపోయి ఆనందం ఆవిష్కృతమవుతుంది. నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా 'ఈనాడు' కథనం.

- ఈనాడు డిజిటల్, తిరుపతి

తిరుపతి జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5.16 లక్షల మంది వృద్ధులున్నారు. వారిలో పురుషులు 2.47 లక్షలు, మహిళలు 2.67 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో రాస్, పాస్ వంటి స్వచ్ఛంద సంస్థలు వృద్ధాశ్రమాలు నిర్వహిస్తున్నాయి. రాస్ పరిధిలోనే పన్నెండు వృద్ధాశ్రమాలు ఉన్నాయి. మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియర్ సిటిజన్ యాక్ట్, 2007 ప్రకారం వారసులు తప్పనిసరిగా కన్నవారికి ఆర్థిక సహాయం అందించాలి. కనీస అవసరాలు తీర్చాలి.

ఇంటికి రావద్దన్నారు: రామచంద్రయ్య



మాది రైల్వేకోడూరు వద్ద గ్రామం. ఇద్దరు కుమారులు, కుమార్తె. మేస్త్రీ పనిచేస్తూ వారిని డిగ్రీ వరకు చదివించి పెళ్లిళ్లు చేశా. నా భార్య అనారోగ్యంతో చనిపోవడంతో పట్టించుకునేవాళ్లు కరవయ్యారు. సమయానికి అన్నం పెట్టలేదు. అందుకే తెలిసిన వాళ్ల సాయంతో వృద్ధాశ్రమానికి వచ్చా. పిల్లలు గుర్తుకొచ్చి ఓసారి ఇంటికెళ్తే రావొద్దు అనడంతో వెళ్లడమే మానేశా. చివరివరకు ఇక్కడే బతుకుతా.

ఎవరైనా ఒకట్రెండు రోజులే: చంద్రమ్మ



మాది తిరుపతి. నా భర్త చనిపోయిన ఆరునెలలకు నా కుమారుడు అనారోగ్యంతో చనిపోయాడు. దాంతో నా కోడలు నన్ను చీదరించుకోవడం, సమయానికి భోజనం పెట్టకపోవడంతో ఆశ్రమానికి వచ్చా. బంధువులు అప్పుడప్పుడు వచ్చి వాళ్ల ఇంటికి రమ్మని అడుగుతారు. గతంలో ఒకరిద్దరి దగ్గరికి వెళ్తే ఒకట్రెండు రోజులు బాగా చూసుకున్నా మూడో రోజున చీదరించుకున్నారు. అందుకే ఎక్కడికీ వెళ్లకుండా ఇక్కడే ఉంటున్నా.

పిల్లలు లేకపోవడంతో : సుబ్బమ్మ



మాకు పిల్లలు లేరు. మా ఆయన బస్సు ప్రమాదంలో గాయపడితే, తెలిసినవారు వృద్ధాశ్రమానికి తీసుకొచ్చారు. నా భర్త చనిపోయాక ఇక్కడున్నవారే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఐదేళ్లుగా ఇక్కడే ఉంటున్నా. ఒంటరి జీవితం ఆనందంగా సాగుతోంది.

ఏ ఒక్కరూ రాలేదు : మోహన్‌రావు



మాది కృష్ణా జిల్లాలోని నిమ్మకూరు. భార్య చనిపోవడంతో పిల్లలు పట్టించుకోవడం మానేశారు. కూలి పనులు చేస్తూ బిడ్డలను పెంచి పెద్దచేశా. చివరకు వాళ్లకు భారంగా మారానని తెలిసి నాకు నేనుగా వృద్ధాశ్రమానికి వచ్చా. రెండేళ్లుగా ఏ ఒక్కరూ నాకోసం రాలేదు.

పీఆర్సీని ప్రకటించాలి

పాకాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పెన్షనర్ల సంఘం పాకాల శాఖ అధ్యక్షుడు పీఆర్ మునస్వామి విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక పెన్షనర్ల భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, కమ్యుటేషన్ కాలపరిమితిని 12 ఏళ్లకు కుదించాలని, కరవు భత్యం బకాయిలను ఒకే వాయిదాలో చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, సంఘ నాయకులు కుప్పస్వామినాయుడు, రామమూర్తి, నారాయణరెడ్డి, మునస్వామి, మునిరత్నంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ తైక్వాండో పోటీల్లో స్వర్ణం

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలో తిరుపతికి చెందిన క్రీడాకారుడు పవన్‌కుమార్ సత్తాచాటారు. గోవా వేదిగా గతనెల 28, 29న జరిగిన పోటీల్లో 75కేజీల విభాగంలో బ్లాక్ బెల్ట్, సీనియర్ కేటగిరీలో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు.

మహిళా వర్సిటీ (తిరుపతి): ఇటీవల జరిగిన పలు క్రీడా పోటీల్లో శ్రీపద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ నారాయణమ్మ పేర్కొన్నారు. విజేతలను ఆమె సోమవారం అభినందించారు. సెట్విన్ ఆధ్వర్యంలో ఎస్వీ సంగీత కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి యువజన సాంస్కృతిక పోటీల్లో తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు కవిత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నారని తెలిపారు.

'శ్రీవారిని దర్శించుకునే అర్హత జగన్ కోల్పోయారు'


రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి మెట్లోత్సవం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పుంగనూరు నుంచి ప్రారంభమైన బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ తిరుమల పరిరక్షణ పాదయాత్ర సోమవారం తిరుపతికి చేరుకుంది. అలిపిరి పాదాల మండపం నుంచి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి వద్ద మీడియాతో మాట్లాడారు. శ్రీవారి లడ్డూ కల్తీ జరిగిందని తెలిసినా రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు రాజకీయంగా మాట్లాడుకోవడం దురదృష్టకరమన్నారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. తితిదే సొంతంగా నెయ్యి ఉత్పత్తికి గోశాల ఏర్పాటు చేయాలన్నారు. జగన్ స్వామిపై భక్తి ఉండని సమర్పించే డిక్లరేషన్ ఇవ్వలేదంటే ఆయనకు స్వామిని దర్శించుకునే అర్హత లేదన్నారు. దర్యాప్తు జరిపి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు


దీపాలు వెలిగిస్తున్న జనసేన నేతలు, కార్యకర్తలు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: శ్రీవారి లడ్డూలో కల్తీ జరిగిందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టినందుకు మద్దతుగా సోమవారం రాత్రి గంగమ్మ గుడిలో దీపారాధన నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జనసేన నాయకులు రాజారెడ్డి, ఊకా మాదవరావు, హరిశంకర్, రాజేష్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి (బైరాగిపట్టెడ): ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తిరుమల పర్యటన అనంతరం 3న తేదీన తిరుపతిలో నిర్వహించే వారాహి బహిరంగ సభ కోసం ఆ పార్టీ శ్రేణులు సభా వేదికను సిద్ధం చేస్తున్నాయి. అమరావతిలో జనసేన కేంద్ర కార్యాలయం నుంచి కార్యక్రమాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ కే.శ్రీనివాస్ సోమవారం తిరుపతి బాలాజీ కాలనీలోని జ్యోతిరావుపూలే సర్కిల్ ప్రాంతాన్ని పరిశీలించారు.

శ్రీవారి గొడుగులకు స్వాగతం


శ్రీవారి గొడుగులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి (బైరాగిపట్టెడ): శ్రీవారి బ్రహ్మోత్సవాల నిమిత్తం చెన్నై నుంచి సోమవారం తిరుపతికి చేరుకున్న శ్రీవారి గొడుగులకు స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శ్రీకోదండ రామస్వామి ఆలయం వద్ద ఘన స్వాగతం పలికారు. ఈ గొడుగులు ప్రతి ఏడాది శ్రీవారికి బ్రహ్మోత్సవాల సందర్భంగా చెన్నై నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి కాలి నడకన తిరుపతికి తీసుకొస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్యాట్ కృష్ణప్రసాద్, సింగం శెట్టి సుబ్బరామయ్య, నరసింహయాదవ్, సతీశ్ నాయుడు, సుబ్రహ్మణ్యం, గుండాల గోపీనాథ్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, జేఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సీఎంను ఆహ్వానించిన ఎమ్మెల్యే ఆరణి: తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబును అమరావతిలోని సచివాలయంలో కలిసిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆహ్వానించారు.

రహదారే.. కుంట కాదు



రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు నుంచి అప్పలాయగుంట, పూడి, పుత్తూరుకు వెళ్లే ప్రధాన రహదారి ఇది. కుప్పంబాదూరు సమీపంలోని బాదూరమ్మ ఆలయం మలుపు వద్ద రోడ్డు కోతకు గురై గుంతలమయమైంది. దీనికితోడు వర్షపునీరు నిలిచి కుంటను తలపిస్తోంది. వాహన చోదకులు ఎక్కడ గుంత ఉందో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఓ ఉపాధ్యాయిని గుంతలో పడగా ఇలాంటి ఘటనలు నిత్యకృత్యం అయ్యాయి.

- న్యూస్‌టుడే, రామచంద్రాపురం

శిథిలావస్థలో పాఠశాల భవనం



కాలూరు క్రాస్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. 1981లో నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరగా పక్కనే మరోటి నిర్మించారు. విద్యాశాఖ అధికారులు స్పందించి శిథిలమైన పాఠశాల భవనాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (గ్రామీణ)

కూర్చొలేరు.. కూర్చుంటే తోయలేరు



సీజనల్ వ్యాధులతో వచ్చిన రోగులతో రుయా ఆసుపత్రిలో సోమవారం రద్దీ నెలకొంది. మెడికల్ ఓపీ విభాగం వద్ద రోగులకు ఏర్పాటు చేసిన బల్లలు ఆద్యంతం కనిపిస్తున్నాయి.. రక్త పరీక్షల కోసం రోగులు పడిగాపులు పడాల్సిన దుస్థితి. కాలం చెల్లిన ఎక్స్‌రే యంత్రం ఎప్పుడు పని చేస్తుందో.. ఎప్పుడు మొరాయిస్తుందో అర్థంకాక టెక్నీషియన్లు తలలు పట్టుకుంటున్నారు.. ముందరి చక్రాలు పనిచేయని వీల్‌ఛైర్‌తో రోగుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు.. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.. **- ఈనాడు, తిరుపతి**

రామా.. కనుమా..!



శ్రీకోదండ రామస్వామి పుష్కరిణి పచ్చి మొక్కలు.. పెరిగి పెద్దవవుతున్న రావి మొక్కలతో అపరిశుభ్రంగా తయారైంది. తెప్పోత్సవాలు.. ప్రత్యేక రోజుల్లో శుభ్రంగా ఉంచుతున్నారు.. మిగిలిన సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా కనిపిస్తోంది. నిత్యం ఇక్కడికి వాకర్స్, కళాకారులు, కళాప్రియులు, సందర్శకులు వస్తుంటారు.. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది. **- ఈనాడు, తిరుపతి**


పదవీ విరమణ పొందిన పోలీసులతో ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

శేష జీవితం ఆనందంగా గడపండి

తిరుపతి(నేరవిభాగం) : సుదీర్ఘకాలం పోలీసు విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్న వారు శేష జీవితం ఆరోగ్యంగా గడపాలని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. తిరుపతి ట్రాఫిక్ పీఎస్ ఏఎస్ఐలు టి.జనార్దన నాయుడు, సి.గోపాల్‌రెడ్డి, తిరుచానూరు పీఎస్ ఏఎస్ఐ ఎం.డి జీవరత్నం, ఆర్మ్‌డ్ హెడ్ కానిస్టేబుల్ ఎస్వీ శంకరప్రసాద్ రెడ్డిలు సోమవారం పదవీ విరమణ చేయగా స్థానిక కవాతు మైదానంలో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్‌కు వీడ్కోలు

తిరుపతి (నేరవిభాగం) : ఆదాయ పన్ను శాఖ తిరుపతి ప్రాంతీయ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్ సోమవారం పదవీ విరమణ చేశారు. స్థానిక ప్రైవేటు హోటల్‌లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. శాఖ చీఫ్ కమిషనర్లు బత్తిన సురేష్, ఎం.అనిల్‌కుమార్, పి.పీర్యా, 45, 46, 47 బ్యాచ్‌లకు చెందిన ఐఆర్ఎస్ అధికారులు పాల్గొని సన్మానించారు. తిరుపతి, కర్నూలు, నెల్లూరు రేంజ్ అధికారులు పాల్గొన్నారు.

కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ ఉద్యోగ విరమణ

తిరుపతి (లీగల్): తిరుపతి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ మజ్జిగ చంద్రశేఖర్ ఉద్యోగ విరమణ పొందారు. ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జరిగింది. పదో అదనపు జిల్లా సెషన్సు జడ్జి టి.రామచంద్రుడు, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి విజయసారథిరాజు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సునీతారాణి ముఖ్యఅతిథులుగా హాజరై మజ్జిగ చంద్రశేఖర్‌ను శ్రీవారి చిత్రపటంతో సత్కరించారు.

సేవలు ఆదర్శనీయం

తిరుపతి(నగరపాలిక): నగరపాలక సంస్థ పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా కె.లక్ష్మీపతి అందించిన సేవలు అదర్శనీయమని ఎంఈవో భాస్కర్ నాయక్ అన్నారు. శివజ్యోతి నగర్ నగరపాలిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూ సోమవారం పదవీవిరమణ చేసిన కె.లక్ష్మీపతిని ఎస్టీయూ ఆధ్వర్యంలో సత్కరించారు. నేతలు కె.ధనుంజయులు నాయుడు, మురళీకృష్ణ, మునికృష్ణమ నాయుడు, హరిప్రసాద్, శ్రీనివాసన్, రమేష్‌నాయక్, మునిరత్నం, రమ్య, రఘునాథ్, మనోహర్ పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

● **మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం.. తిరుపతి (నేరవిభాగం):** వృద్ధులు, వికలాంగులు, మహిళల ఫిర్యాదులకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా త్వరితగతిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 85 ఫిర్యాదులు అందాయి.

● **డీఎఫ్‌వోగా బాధ్యతల స్వీకరణ.. జీవకోన(తిరుపతి):** అటవీశాఖ (ఫ్లయింగ్ స్క్వాడ్) డీఎఫ్‌వోగా జి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా డీఎఫ్‌వో 94408 10070, రేంజర్ 94408 10302 నంబర్లకు సమాచారం ఇవ్వాలని డీఎఫ్‌వో కోరారు.

● **సిద్ధేశ్వరునికి విశేష అభిషేకాలు.. యర్రావారిపాలెం:** తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయంలో నంది వాహన సేవ ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు అన్నదానం చేశారు. ఈవో జయకుమార్, అర్చకులు శివప్రసన్నశర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

● **విద్యార్థులకు సామగ్రి వితరణ.. తిరుపతి (పశువైద్య విశ్వవిద్యాలయం):** తిరుపతిలోని పశువైద్య కళాశాల విద్యార్థులకు స్వచ్ఛతా హీ సేవ ప్రచార సామగ్రిని కళాశాల అసోసియేట్ డీన్ డా.జగపతి రామయ్య అందజేశారు. విద్యార్థి వ్యవహారాల అధికారి డా.వేణు, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసరావు, అమరావతి, వేంకటేశ్వర్లు, రాజా పాల్గొన్నారు.

● **'కూటమి సర్కారు దళితలను అణచివేస్తోంది'.. జీవకోన(తిరుపతి):** అమరావతి పరిధిలో కూటమి ప్రభుత్వం దళితులను అణచివేస్తోందని ఎంపీ మద్దిల గురుమూర్తి ఆరోపించారు. సోమవారం ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌కు మాజీ ఎంపీ నందిగం సురేష్ తరపున ఆయన సతీమణి బేబి లతతో కలిసి వినతి పత్రం అందజేశారు. మాజీ ఎంపీపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, కమిషన్ జోక్యం చేసుకోవాలని కోరారు.

● **47 వినతులు.. తిరుపతి (నగరపాలిక):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కమిషనర్ ఎన్.మౌర్య సోమవారం వినతులు స్వీకరించారు. 47 మంది తమ సమస్యల్ని కమిషనర్‌కు రాతపూర్వకంగా తెలిపారు. వీధుల్లో చెట్లు పెరిగాయని, తాగునీటి సరఫరా, మురుగునీటి సమస్య, వీధిదీపాలు, టి.డి.ఆర్ బాండ్లపై వినతులు ఎక్కువగా వచ్చాయి.

అచ్చుపుస్తకాల పంపిణీ.. పాకాల : ఓబులశెట్టివారిపల్లిలో విద్యార్థులకు రెండో సెమిస్టర్ అచ్చు పుస్తకాలను ఎంఈవో బాబ్జీ పంపిణీ చేశారు. మండలంలోని 59 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 6 ఉన్నత పాఠశాల్లో చదువుతున్న 3019 మందికి అచ్చు పుస్తకాలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రవినాయుడుకు కేకు తినిపిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నేతలు

శాప్ ఛైర్మన్‌కు అభినందన సభ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఎస్వీయూ సెనేట్ హాల్లో సోమవారం టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో శాప్ ఛైర్మన్‌గా నియమితులైన వర్సిటీ పూర్వ విద్యార్థి అనిమిని రవినాయుడుకు సోమవారం అభినందన సభ ఘనంగా నిర్వహించారు. హరికృష్ణ యాదవ్, ఆనంద్ గౌడ్, మహేష్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, రామ్మోహన్, డాక్టర్ రమణ, హేమంత్ రాయల్ పాల్గొన్నారు. **మహిళా వర్సిటీ(తిరుపతి):** రాష్ట్రం గర్వించేలా క్రీడా రంగాన్ని అభివృద్ధి చేస్తామని రవినాయుడు పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో కళాశాల క్రీడాకారిణుల అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ: వ్యక్తి దుర్మరణం

చంద్రగిరి, న్యూస్‌టుడే: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ మార్గం ఐతేపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.. ముంగిళిపట్టు గ్రామానికి చెందిన రైతు ముండ్లూరి జయపాల్‌నాయుడు(50) వ్యక్తిగత పనులపై తన ద్విచక్ర వాహనంలో చంద్రగిరి నుంచి స్వగ్రామం ముంగిళిపట్టుకు సర్వీసు రోడ్డులో ప్రయాణిస్తుండగా ఐతేపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన ముండ్లూరి జయపాల్ నాయుడును '108' వాహనంలో చంద్రగిరిలోని ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందారని నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


ముండ్లూరి జయపాల్‌నాయుడు (పాతచిత్రం)

చంద్రగిరి ప్రాంతీయ ఆసుపత్రిలో తొలి పోస్టుమార్టం

చంద్రగిరి ప్రాంతీయ ఆసుపత్రిలో సోమవారం తొలి పోస్టుమార్టం చేశారు. ఇప్పటి వరకు చంద్రగిరి పోలీసు సర్కిల్ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో మృతదేహాలను తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి. అక్కడ శవపరీక్షలు నిర్వహించాలంటే రెండు మూడు రోజులు బాధిత కుటుంబ సభ్యులు నిరీక్షించాల్సిన పరిస్థితి. కేవలం నాలుగు గంటల వ్యవధిలో పరీక్షలు పూర్తిచేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించడంతో వైద్యులు, పోలీసులు ఉపసమనం పొందారు.

ట్రాఫిక్ అంతరాయం కేసుల్లో జరిమానా

తిరుపతి (లీగల్): తిరుపతి గ్రామీణ పరిధిలోని పోలీసుస్టేషన్ల పరిధిలో ట్రాఫిక్ అంతరాయం కేసుల్లో ఎనిమిది మందికి, డ్రంకన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తి మొత్తం రూ.18,800 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి సీకేవీ సత్యకాంత్ కుమార్ సోమవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు పోలీసులు తెలిపారు. తిరుపతి గ్రామీణ పరిధిలోని చంద్రగిరి, తిరుచానూరు, రేణిగుంట, గాజులమండ్యం, తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలో ట్రాఫిక్ అంతరాయం కల్గించిన పలువురిపై కేసులు నమోదుచేసి కోర్టుకు అప్పగించారు. కేసు విచారణ సమయంలో నిందితులు నేరం అంగీకరించారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: యర్రావారిపాలెం మండలంలోని యల్లమంద - ఉస్తికాయలపెంట మార్గమధ్యంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లేలమంద నుంచి యల్లమందకు అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎర్రిస్వామి తెలిపారు.

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు

రిసార్ట్‌కు ‘బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్’ అవార్డు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): టూరిజం, హాస్పిటాలిటీ రంగంలో 2023-24 సం.నికి గాను ‘ఉత్తమ పర్యావరణ అనుకూల హోటల్’ అవార్డును శ్రీసిటీలోని మ్యాంగో రిసార్ట్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన ఆతిథ్య సేవలకు గాను ఈ గుర్తింపు దక్కింది. ఏపీ ప్రభుత్వ యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, సాంస్కృతికశాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్(ఐఏఎస్), ఏపీ టూరిజం అథారిటీ సీఈవో ఎం.అభిషిక్త్ కిషోర్ చేతుల మీదుగా మ్యాంగో రిసార్ట్ జనరల్ మేనేజరు వై.శ్రీనివాసరావు ఈ అవార్డును శనివారం రాత్రి అమరావతిలో స్వీకరించారు.


అవార్డు అందుకుంటున్న మ్యాంగో రిసార్ట్ మేనేజరు

ప్రధానోపాధ్యాయినిపై విచారణ

సత్యవేడు: రాజగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిపై ఎం.జ్యోతిపై విచారణ చేపట్టారు. దాసుకుప్పంలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేసిన సమయంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ మేరకు సోమవారం దాసుకుప్పం పాఠశాలలో విచారణ చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, నాగలాపురం

సమస్య: రాజులకండ్రిగ పంచాయతీ పరిధిలోని జానకాపురం ఎస్సీకాలనీ వద్ద రహదారిపైనే చెత్తను పడేస్తున్నారు. దీంతో దుర్వాసనతో పాటు పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. చెత్తను తొలగించి పారిశుద్ధ్య పనులు చేపట్టాలి.
– వెంకటేష్, జానకాపురం

సమాధానం: రహదారిపైన చెత్తను వేయవద్దని గ్రామస్థులకు సూచనలు చేసినా ఫలితం లేక పోయింది. రెండు రోజుల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్, సున్నంలను పిచికారీ చేయిస్తాను. – భాస్కర్‌రాజు, సర్పంచి, రాజులకండ్రిగ

న్యూస్‌టుడే, బీఎన్‌కండ్రిగ

సమస్య: మండలం కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పిచ్చి మొక్కలు తొలగించాలి.
– రాజేష్, స్థానికుడు

సమాధానం: రెండు రోజుల్లో పిచ్చి మొక్కలు తొలగిస్తాం. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం. – ఇందిరమ్మ, పంచాయతీ కార్యదర్శి

న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: మండలంలోని విరూపాక్షిపురం గ్రామానికి వెళ్లే రోడ్డుకి ఇరువైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరగడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని ముళ్ల చెట్లను తొలగించాలి.
– నరేష్

సమాధానం: ఈ విషయం మా దృష్టికి రాలేదు. స్థానిక పంచాయతీ కార్యదర్శితో చర్చించి ముళ్ల కంపలను తొలగించే దిశగా చర్యలు తీసుకుంటాం.
– తరుణాక్షిరెడ్డి, ఈవోపీఆర్డీ

పంపిణీలో అలసత్వం వద్దు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పింఛన్ల పంపిణీలో అలసత్వం వద్దంటూ పురపాలక సంఘ కమిషనర్ బి.ఎస్.గిరికుమార్ సూచించారు. పట్టణంలోని పురపాలక సంఘ సమావేశపు హాలులో సోమవారం అక్టోబరు ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ విషయమై పురపాలక, సచివాలయ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల సూచనల మేరకు వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలంటూ దిశానిర్దేశం చేశారు.

కమిషనర్‌కు విన్నపం

శ్రీకాళహస్తి: పురపాలక సంఘ పరిధిలోని 9వ వార్డులో కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని ఆ వార్డు మాజీ కౌన్సిలర్ సుప్రజ కమిషనర్ బి.ఎస్.గిరికుమార్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె కమిషనర్‌ను కలిసి సత్కరించారు. వార్డులోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అన్నప్రాసన

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: పోషక విలువలు గల్గిన తృణధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలను భుజించడం ద్వారా మాతాశిశుమరణాలు లేని ఆరోగ్యకర సమాజానికి నాంది పలకాలని సీడీపీవో దేవకుమారి పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాల మండల స్థాయి ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శాప్ ఛైర్మన్‌కు ఘన సత్కారం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవి నాయుడును శ్రీకాళహస్తి తెదేపా పట్టణ కమిటీ అధ్యక్షులు విజయ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సోమవారం తిరుపతిలో ఆయన్ను కలిశారు. నియోజకవర్గ పరంగా క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తామని హామీ ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ● శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవినాయుడును తెదేపా నేతలు ఘనంగా సత్కరించారు. వెన్నెలక క్షత్రియ సాధికారిక సమితి రాష్ట్ర సభ్యులు రవి, నేతలు పాల్గొన్నారు.


శాప్ ఛైర్మన్‌గా నియమితులైన రవినాయుడును సత్కరిస్తున్న తెదేపా నేతలు

తొట్టంబేడు: శాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనిమిని రవినాయుడును సోమవారం తెదేపా మండలాధ్యక్షుడు గాలి మురళీనాయుడు తిరుపతిలోని తితిదే పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. శ్రీకాళహస్తిలోని క్రీడా సమస్యలను పరిష్కరించడంతో పాటు క్రీడాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

వృద్ధులకు చీరల పంపిణీ

తొట్టంబేడు, న్యూస్‌టుడే: అనాథ వృద్ధులకు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కోటా వినుత చీరలు పంపిణీ చేశారు. మండలంలోని శివనాథపురం గ్రామంలోని అమ్మ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా చీరలను వితరణగా అందించారు. నిరుపేద అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పించి అండగా ఉంటున్న ఆశ్రమ నిర్వాహకులు బాధేటి సుజాతను అభినందించారు. జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.


వృద్ధులకు చీరలు అందజేస్తున్న వినుత

‘ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఎత్తివేయాలి’

కేవీబీపురం: ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ విధించిన సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు గాదిరాజు లక్ష్మీపతి రాజు కోరారు. సోమవారం కేవీబీపురంలో విలేకరులతో తెలుగుయువత నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్షతో ఎమ్మెల్యేను హనీట్రాప్‌లో కొంత మంది వ్యక్తులు ఇరికించారన్నారు. తెలుగుయువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సర్పంచి బాలాజీ, మాజీ సర్పంచులు సురేష్‌రెడ్డి, వెంకటేష్, మునికుమార్‌యాదవ్, సమన్, వెంకటస్వామి, నరేంద్ర పాల్గొన్నారు.

విధులకు ఆలస్యం.. ఫిర్యాదులపై నిర్లక్ష్యం

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండల ట్రాన్స్‌కో ఏఈ సోమవారం ఉదయం 11 గం.ల వరకు విధులకు హాజరుకాలేదు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా పలు సమస్యలపై కార్యాలయానికి వచ్చిన రైతులు వెనుదిరిగారు. సాధారణ రోజుల్లో క్షేత్ర స్థాయి పనుల్లో ఉన్నామని చెప్పే అధికారులు, గ్రీవెన్స్‌డే తప్పని సరిగా హాజరు కావాల్సి ఉంది. కానీ ఆటు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ డేకి సైతం ఏఈ హాజరు కాకపోవడం రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ గ్రీవెన్స్‌డే తప్పకుండా హాజరయ్యేలా చూస్తామని తెలిపారు.

ధోరణి మారితేనే అతివలకు ఉన్నత స్థితి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పిల్లల పెంపకంలో సమాజ ఆలోచన ధోరణి మారితేనే మహిళలు మరింత ఉన్నత స్థానాల్లోకి చేరగలరని ఎస్సీవీ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీలత పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాల ఆవరణలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సోమవారం ధోరణి కార్యక్రమం నిర్వహించారు. నేటి కాలంలో మహిళల క్రమశిక్షణ, ప్రాముఖ్యతలను విద్యార్థులకు వివరించారు. డా.తులసి, డా.సునీత, సుభాషిణి, రుద్రమదేవి, శివలక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు అరికట్టండి సారూ

ఏర్పేడు, న్యూస్‌టుడే: మునగలపాళెం సమీపంలోని స్వర్ణముఖినదిలో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలని స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బయట ప్రాంతాలకు చెందిన కొందరు వ్యక్తులు సోమవారం జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తుండగా మునగలపాళెం, చెల్లూరు, కుమ్మరఅగ్రహారం, గుండ్లకండ్రిగ గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. అయితే ఇసుకాసురులు తవ్వకాలు నిలుపక పోవడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టించుకోవాల్సిన అధికారులు సాయంత్రం నామమాత్రంగా స్వర్ణముఖి నది వద్దకు చేరుకుని వెనుదిరగడంతో స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో పూర్తి స్థాయిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాల్లో నిత్యం అధికారులు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడంతో ఇసుక అక్రమ రవాణా యధావిధిగా కొనసాగుతుందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ పొలాలకు సమీపంలో ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో రానున్న వర్షాకాలంలో కోతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.


స్వర్ణముఖినది నుంచి ట్రాక్టర్లతో తరలిస్తున్న ఇసుక

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: స్వర్ణముఖినది నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును సోమవారం రెండో పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. మండలంలోని విరూపాక్షిపురం సమీపంలోని స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని శ్రీకాళహస్తి పట్టణంలోని శివం కళ్యాణ మండపం సమీపంలో అదుపులోకి తీసుకుని స్టేషన్‌కి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని పాపసముద్రంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎల్లయ్య(40) ఆదివారం అర్ధరాత్రి బహిర్భూమికి వెళ్లారు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విగతజీవిగా పడిఉండటం చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

అది ఇక్కడ.. ఇది అక్కడ

● ఆర్జిత అభిషేకం కౌంటర్ మార్పు

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారులు మారినప్పుడల్లా, ట్రస్టుబోర్డు పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడల్లా మార్పులు చేర్పులు జరుగుతూనే ఉంటాయి. అయితే మార్పుల వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉండకూడదు.
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

మార్పు.. ఆదాయం కూర్పు

గతంలో ఆలయ ఆవరణలో ఉంటూ వచ్చిన పబ్లికేషన్ స్టాల్ గత ఈవో ఆరుబయటకు మార్చారు. ఇక్కడి స్టాల్లో ఆలయ స్థల పురాణం, పురాణ ప్రాశస్త్యం తెలియజేసే పుస్తకాలు, విభూది, కుంకుమతో పాటు లాకెట్లు, చిన్న ఫొటోలు తదితర వాటిని విక్రయిస్తుంటారు. అయితే ఆవరణలో ఉన్న దీన్ని సుపథ మండపంలోకి మార్పు చేశారు. దీన్ని తిరిగి దక్షిణ గోపురాన్ని ఆనుకుని ఉన్న ఆర్జిత అభిషేకం కౌంటర్‌లోకి మార్పు చేశారు. దీనివల్ల కాస్తంత ఆదాయం పెరగడమే తప్ప తద్వారా పెద్దగా ఇబ్బందులు ఉండవు.

ఆర్జితం.. ఇక అవస్థలే

దక్షిణ గోపురం వద్ద ఉన్న ఆర్జిత అభిషేకం కౌంటర్‌ను సుపథ మండపంలోకి తీసుకువచ్చారు. అయితే ఈ మార్పు కారణంగా ఆర్జిత అభిషేకాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కల్గించే విధంగా తయారైంది. సాధారణంగా రుద్రాభిషేకం, మహన్యాసంతో పాటు దక్షిణామూర్తి, కాలభైరవస్వామి, శనిభగవానుడు, మృత్యుంజయస్వామి తదితర దేవతా మూర్తుల అభిషేకాలకు టికెట్లు ఇక్కడి కౌంటర్ ద్వారానే తీసుకోవాలి. రద్దీ సమయాల్లో టికెట్ల కోసం భక్తులు ముందస్తుగా నిరీక్షిస్తుంటారు. అయితే సుపథ మండపంలో కౌంటర్ మార్పు చేయడం కారణంగా భక్తులకు అవస్థలు తప్పవు. ఎందుకంటే ఇప్పటికే సుపథ మండపం ఇరుకైంది. పక్కనే అన్నదానం ఉండటంతో భక్తులు ఇక్కడ నిరీక్షిస్తుంటారు. దీంతో పాటుగా గోకులం, లగేజీ స్కానర్ గది, ప్రైవేటు బుక్‌స్టాళ్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడూ గందరగోళంగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో కౌంటర్ వద్ద నిరీక్షించాలంటే భక్తులకు అవస్థలు తప్పవు. క్యూలైన్లో వచ్చి టికెట్ తీసుకుని అడ్డదారిన వెళ్లాల్సిన పరిస్థితి. అందులోనూ రంగులగోపురం, తిరుమంజనగోపురం, శివయ్య గోపురం గుండా భక్తులు దక్షిణ గోపురం వద్ద ఉన్న ఆర్జిత అభిషేకం కౌంటర్‌కు చేరుకోవాలంటే కాస్తంత ప్రయాసకు గురి కావాల్సిందే. ఇలాంటి సమస్యలు పరిష్కరించే విధంగా ఆర్జిత అభిషేకం కౌంటర్ విషయంలో అధికారులు మరో దఫా ఆలోచించి భక్తులకు అందుబాటులో ఉంచే దిశగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇదే విషయమై అధికారులు ఈ తరహా సమస్యలు ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.


సుపథ మండపంలో మార్చిన ఆర్జిత అభిషేక కౌంటర్


దక్షిణకాళీ ఆలయం వద్ద సిద్ధం చేస్తున్న పబ్లికేషన్ స్టాల్

మహాత్ముని జయంతికి సన్నాహాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయం భిక్షాల గాలి గోపురం సమీపంలో చారిత్రాత్మక కట్టడమైన మహాత్ముని విగ్రహాన్ని మండపంలో ఏర్పాటు చేశారు. ఈ దఫా గాంధీ జయంతి వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేస్తుండటం విశేషం. గత ట్రస్టు బోర్డు హయాంలో వాహన మండపం నిర్మాణ సమయంలో అక్కడ అడ్డుగా ఉన్న గాంధీబొమ్మతో ఉన్న మండపాన్ని తొలగించారు. నెలలు గడిచిపోతున్నా తిరిగి విగ్రహ ఏర్పాటు విషయమై దృష్టి సారించలేదు. ఈ విషయమై గత నెల 18వ తేదీన ‘మహాత్మా మన్నించు’ శీర్షికన ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. దీంతో ఆలయ ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఆఘమేఘాలపై మండప నిర్మాణం చేపట్టడంతో పాటు మహాత్ముని విగ్రహాన్ని క్రేన్ సహాయంతో మండపంలో ఏర్పాటు చేయించారు. అక్టోబరు 2వ తేదీన మహాత్ముని జయంతి ఉత్సవాలకు మండపం ముస్తాబు చేపట్టడం పట్ల పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


మహాత్ముని విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న ఆలయ ఇంజినీరింగ్ అధికారులు

మహాసభను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి(గ్రామీణం)(ఏర్పేడు), న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు రేగంటి దేవానంద్ కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని ఎగువవీధి ప్రాథమిక పాఠశాలలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరంలో 6 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు, 20వ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక మహాసభలకు పెద్దఎత్తున ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గ్రామీణ అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యాయులు వెంకటసుబ్బలక్ష్మి, పోతురాజు, చంద్రకళ, మునికృష్ణారెడ్డి, సుచరిత, యశోద, వినీత పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బృందావనాలతో సంపద సృష్టి


బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: బృందావనాలతో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటూనే సంపద సృషించవచ్చని పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని కారణిమిట్ట, బీఎన్‌కండ్రిగ, నెరిణికండ్రిగ, కంచనపుత్తూరు గ్రామాల్లో చెత్త బుట్టలు పంపిణీ చేశారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరువేరుగా బుట్టల్లో వేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని కోరారు. సర్పంచులు కందేరి పద్మమ్మ, స్వప్న, వెంకటమ్మ, తెదేపా నాయకులు కార్తీక్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంగా డాంగే యాదవ్



సత్యవేడు, న్యూస్‌టుడే: సత్యవేడు నూతన ఏపీఎంగా డా.డాంగే యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధరణ బదిలీల్లో భాగంగా తిరుపతి డీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న డాంగే యాదవ్‌ను సత్యవేడు వెలుగు ఏపీఎంగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఇక్కడ బాధ్యతలు తీసుకున్నారు. పలువురు సంఘ మిత్రులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ మిత్రులు సుగుణ, అనసూయ, మంజుల, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ డీఈఈగా రత్నారెడ్డి



సత్యవేడు, న్యూస్‌టుడే: సత్యవేడు సబ్ డివిజన్ ఇరిగేషన్ డీఈఈగా పీఎస్ రత్నారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధరణ బదిలీల్లో భాగంగా పిచ్చాటూరు ఇరిగేషన్‌లో పని చేస్తున్న పీఎస్ రత్నారెడ్డి ఇక్కడకు బదిలీ అయ్యారు. చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు ఉంటామని హెచ్చరించారు.

విద్య ప్రైవేటుపరం చేయొద్దు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని ప్రైవేటు పాఠశాల ఆవరణలో సోమవారం జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారని, ప్రస్తుతం ఎంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్న విషయమై వివరాలు తెలియజేయాలన్నారు. జిల్లా అధ్యక్షులుగా జాకీర్, ఉపాధ్యక్షులు నరేంద్ర, కార్యదర్శి లోకేశ్, సహాయ కార్యదర్శి మణి, కోశాధికారి రిజ్వాన్, చైతన్య, యువరాజ్, రవితేజ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్

శ్రీసిటీ-మాండలెజ్ ఆధ్వర్యంలో పాఠశాలలకు డస్ట్‌బిన్ల వితరణ


పాఠశాలకు డస్ట్‌బిన్లను అందిస్తున్న మాండలెజ్ పరిశ్రమ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ ప్రచారంలో భాగంగా మాండలెజ్ పరిశ్రమ శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం రూ.లక్ష విలువైన డస్ట్‌బిన్లను(చెత్తడబ్బాలు) వితరణగా అందించారు. మాండలెజ్ హెచ్‌ఆర్ మేనేజరు రవళి తెలిపారు. శ్రీసిటీ సీఎస్‌ఆర్ మేనేజరు నిరీషా సన్నారెడ్డి, మాండలెజ్ ప్రతినిధులు వెంకన్న, అమన్, ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వారపు సంత దుస్థితి

రేణిగుంట, న్యూస్‌టుడే: రేణిగుంట వారపు సంత సమస్యను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెదేపా పట్టణాధ్యక్షులు మహబుబ్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనాడులో ‘సెంచరీ సంత.. కొనుగోలుదారులకు చింత’ శీర్షికతో ప్రచురితమైన కథనం గురించి తెలిపామన్నారు. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా చరిత్ర కలిగిన వారపు సంత పూర్తిగా అభివృద్ధికి నోచుకోలేదని, ఇకపై అలా కాదని ఇప్పుడున్న ప్రజా ప్రభుత్వ పాలనలో అభివృద్ధి చేసి చూపుతామని తెలిపారు.

అర్థమయ్యే రీతిలో విద్యాబోధన జరగాలి

ఏర్పేడు, న్యూస్‌టుడే: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా విద్యాబోధన చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ తెలిపారు. మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం పరిశీలన బృందంతో కలిసి తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు తనిఖీ చేశారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి చదువుల్లో రాణించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. తెలుగు ఉపాధ్యాయులు కిట్టన్న రచించిన బాలకళానిధి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద్, పరిశీలన బృందం వెంకటరమణ, వేణుగోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్, భాగ్యశేఖర్‌రెడ్డి, కిట్టన్న, షాజహాన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.


జిల్లా స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినుల ఎంపిక

కేవీబీపురం, న్యూస్‌టుడే: ఈనెల 28వ తేదీన నాగలాపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా క్రీడా పోటీలకు కేవీబీపురం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు ఎంపికైనట్లు ఎస్‌వో సుకన్య తెలిపారు. అండర్ 14 కబడ్డీ పోటీలకు మధుమతి, అండర్ 17 కబడ్డీలో నవనీత, యోగా అండర్ 14లో భానుప్రియ, అండర్ 17లో అంజు, వాలీబాల్ అండర్ 14లో మధుమతి ఎంపికైనట్లు ఆమె వివరించారు. వచ్చే నెలలో జిల్లా స్థాయి పోటీలకు వీరు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా పోటీల ఎంపికకు కృషి చేసిన పీఈటీ సతీ సావిత్రిని, విద్యార్థినులను ఎస్‌వో అభినందించారు.


ఎస్‌వో సుకన్య, పీఈటీ సతీసావిత్రి

మద్యం మత్తులో యువకుడి వీరంగం

కేవీబీపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ యువకుడు వీధుల్లో వీరంగం సృష్టించడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం కేవీబీపురం మండలంలోని అంజూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యువకుడు కిరణ్(35) కత్తితో ఆదివారం సాయంత్రం నుంచి నన్ను అడ్డుకునే ప్రయత్నం చేస్తే పొడిచి చంపుతానంటూ వీధుల్లో తిరిగాడు. చౌకదుకాణం డీలర్ గురవయ్యను చంపడం ఖాయమంటూ కేకలు వేస్తూ అతని ఇంటిపైకి కత్తితో వెళ్లడంతో గురవయ్య కుటుంబంతో సహా పక్క ఇంట్లో తలదాచుకోవాల్సి వచ్చింది. సంఘటనపై బాధితుడు గురవయ్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మద్యం మత్తులో వీరవిహారం చేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సంఘటనపై కేవీబీపురం ఎస్సై వీరాంజనేయులును వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కాలం కన్నా.. ప్రాణం విలువైంది: ఎస్సై

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: కాలం కన్నా ప్రాణం విలువైందని, వాహనదారులు అతివేగంగా ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్సై విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ప్రజాగతి ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, కానిస్టేబుల్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో ప్రణాళికలు రచించాలి

ఏర్పేడు: గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సభల్లో ప్రణాళికలు రచించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆమందూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం పరిశీలించారు. ప్రతి రోజు రూ.300 గిట్టుబాటు ధర లభించేలా కూలీలు పని చేయాలన్నారు. కూలీలను అడిగి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రాజు, దేవరి, బాలాజీరావు పాల్గొన్నారు.

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట



గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కిలో రూ. 60 నుంచి రూ. 80 వరకు

రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	125
లేయర్	110
బ్రాయిలర్	224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	250
లేయర్ మాంసం	187

వరద బాధితులకు దాతల సాయం

గూడూరు పట్టణం: వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి నియోజకవర్గంలోని పలువురు దాతలు అందించిన రూ. 3.36లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు సోమవారం అమరావతిలో అందజేశారు.

పౌరహక్కుల దినోత్సవం

కోట: కోట పంచాయతీ పరిధిలోని నార్త్ గిరిజనకాలనీలో అధికారులు సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. పలు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో భవాని, ఎంఈవో2 మస్తానయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



అభినందన కార్యక్రమంలో విజేతలు, అధ్యాపకులు

కోట: చిట్టేడులోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు సెప్టెంబరు 27, 28 తేదీల్లో నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. అండర్-19 100, 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్‌లో మహేష్ ద్వితీయస్థానం, అండర్-17 1,500 మీటర్ల పరుగులో చరణ్ ప్రథమస్థానం, అండర్-14 ఖోఖోలో సాయిమోహన్ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను ప్రిన్సిపల్ శుభాకర్‌రావు, పీడీ కార్తీక్, పీఈటీ మూర్తి సోమవారం అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: రెవెన్యూ డివిజన్ అధికారిణిగా బాధ్యతలు చేపట్టిన ఈ.కిరణ్మయి సోమవారం కలెక్టర్ డా.వెంకటేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె కలెక్టర్‌కు మొక్క అందజేసి పరిచయం చేసుకున్నారు.

గ్రీవెన్స్‌డేను సద్వినియోగం చేసుకోండి



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆమె హాజరయ్యారు. పలువురు నుంచి అర్జీలు స్వీకరించి, పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, డీఏవో రవికుమార్ పాల్గొన్నారు.

వేతనాలు జమ కాలేదని ఫిర్యాదు



అధికారులకు ఫిర్యాదు చేస్తున్న క్షేత్రసహాయకులు

కోట: మండలంలోని ఆరు పంచాయతీలకు సంబంధించిన కూలీల మస్టర్లను డిలీట్ చేశారని, దీంతో 1,200 మందికి వేతనాలు ఖాతాల్లో జమకాలేదని క్షేత్రసహాయకులు సోమవారం స్థానిక కార్యాలయంలో ఎంపీడీవో భవాని, ఏపీవో పూర్ణిమకు వినతిపత్రం అందజేశారు. గత వారం రోజులుగా అల్లంపాడు, జరుగుమల్లి, కొత్తపట్నం, సిద్ధవరం, వంజివాక, కోటలో క్షేత్రసహాయకులు కూలీల చేత ఉపాధి పనులు చేయించారు. మస్టర్లు ఆన్‌లైన్ చేశారు. సాంకేతిక కారణాల వల్ల మస్టర్లు డిలీట్ కావడంతో వేతనాలు ఖాతాల్లో జమ కాలేదు. సమస్యను ఎంపీడీవో భవాని, ఏపీవో పూర్ణిమ దృష్టికి తీసుకెళ్లడంతో కూలీందరికి వేతనాలు అందేటట్లుగా చూస్తామన్నారు.



దొరవారిసత్రంలో అమ్మకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దారు శైలకుమారి

ప్రకృతి వ్యవసాయంతో మేలైన ఆరోగ్యం

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: రసాయనిక మందులు, ఎరువులు వినియోగించకుండ ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల మేలైన ఆరోగ్యం సొంతమవుతుందని స్థానిక తహసీల్దారు శైలకుమారి అన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద రైతు సత్యనారాయణ ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ వనుల అమ్మక కేంద్రాన్ని ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.

ఆక్రమణలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: నియోజకవర్గంలో భూ కబ్జాలు ఎక్కువయ్యాయని వాటిపై చర్యలు తీసుకోవాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం కలెక్టర్ ఒ.ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. అధికారులు రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని తెలిపారు.

మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: 40 ఏళ్లు నిండిన మహిళలందరూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని తొగరాముడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు నవీన, తరుణ్‌సాయి తెలిపారు. సోమవారం కల్లూరు సచివాలయంలో పింక్ బస్ వైద్య సిబ్బంది పలువురు మహిళలు, పురుషులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

దివ్యాంగులకు వీల్‌చైర్ల అందజేత

చిల్లకూరు, న్యూస్‌టుడే: చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పలువురు దివ్యాంగులకు సోమవారం వీల్‌చైర్లను అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు శ్రీనివాసులు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతినిధులు పిచ్చయ్యనాయుడు, శిరీషా, రామానాయుడు, బాబు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సూర్యనారాయణ

వాకాడు, న్యూస్‌టుడే: వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో అక్రమ మద్యం అమ్మకాలు లేకుండా చేస్తానన్నారు. ● **పెళ్లకూరు:** మండల ఉప తహసీల్దార్‌గా యువరాజ్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ● **వెంకటగిరి:** వెంకటగిరి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐగా సూర్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీలో భాగంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో సీఐగా పని చేస్తున్న సూర్యనారాయణ వెంకటగిరికి బదిలీ అయ్యారు.

నిందితుల అరెస్టు

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: రాఘవాపురం, నాత్తువత్తూరుల్లోని రొయ్యల గుంటల వద్ద విద్యుత్తు తీగలు చోరీ చేసిన కేసులో వేణుమాధవ్, ఈశ్వర్ నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై చినబలరామయ్య సోమవారం తెలిపారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కాదలూరులో పట్టపగలే చోరీ

తడ, న్యూస్‌టుడే: కాదలూరులో సోమవారం పట్టపగలు చందనమూడి పురుషోత్తం ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి పరిశ్రమల్లో విధులకు వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం, బీరువా పగలకొట్టి ఐదు సవర్ల బంగారు నగలు, రూ.2లక్షల నగదు తీసుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తడ ఎస్సై కొండప్పనాయుడు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు


పెళ్లకూరు: తాళ్వాయపాడులో రెండువర్గాల గొడవ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. సురేఖ, మరో మహిళ వెంకటమ్మల మధ్య రెండు రోజుల కిందట ఇంటి నిర్మాణ విషయంలో ఘర్షణ పడ్డారు. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● ఇదీ సూళ్లూరుపేట పురపాలిక పరిస్థితి

పేరుకు హెల్ప్‌లైన్.. స్పందన ఆఫ్‌లైన్..!

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: 'ఎక్కడైనా సమస్య లుంటే మాకు ఫోన్ ద్వారా తెలపండి.. వెంటనే మేము స్పందిస్తాం.. ఇందు కోసం హెల్ప్‌లైన్ అందుబాటులోకి తీసుకొచ్చాం'.. అంటూ పురపాలక అధికారులు ప్రకటించారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. సమస్య చెప్పినా ఆలకించేవారే కరవయ్యారని పురవాసులు పేర్కొంటున్నారు.

సూళ్లూరుపేట పురపాలికలో ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికి హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు 82976 22273 ఫోన్ నంబరును కేటాయించారు. హెల్ప్‌లైన్‌ను 2020లో ప్రారంభించారు. దీనిపై అప్పట్లో విస్తృత ప్రచారం చేశారు. ఇందుకు పురపాలక కార్యాలయం వద్ద బోర్డును సైతం ఏర్పాటు చేశారు. అసలు విషయానికి వస్తే.. హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన మొదట్లో ఎవరైనా సమస్యలపై ఫిర్యాదు చేస్తే.. సంబంధిత ప్రాంతానికి పురపాలక సిబ్బంది వెళ్లి, ఆరా తీసి పరిష్కరించేవారు. ఇందులో ఆర్థిక పరమైన సమస్యలకు మినహాయింపు ఉండేది. దీనికి ప్రస్తుతం స్పందన కరవైంది. దీనిపై పురపాలకులు దృష్టి పెట్టడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో సమస్యలు పేరుకుపోతున్నాయి.



కొన్నింటిని పరిశీలిస్తే..

■ పురపాలికలోని సాయినగర్‌లో రోజూవారీగా చెత్త సేకరణ జరగడం లేదు. మూడు రోజులకొకసారి తీస్తున్నారు. దీనిపై స్థానికులు హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే వ్యక్తి ఇంటికెళ్లి, అక్కడ ఉన్న చెత్త మాత్రమే తీసుకొచ్చారు. వీధుల్లోని చెత్తను తొలగించలేదు. ■ కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలువురు ఫిర్యాదు చేసినా పురపాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ■ కోళ్లమిట్ట ప్రాంతంలో మన్నేముత్తేరికి వెళ్లే రహదారి పక్కన చేతికందే ఎత్తులో విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేశారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ■ పట్టణంలోని నివాసాల మధ్య పలుచోట్ల మురుగు నిల్వ ఉంటోంది. హెల్ప్‌లైన్ దృష్టికి తీసుకెళ్తే ఇదిగో.. అదిగో.. అంటూ కబుర్లతో కథ ముగించేశారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం...

సిబ్బందితో సమీక్షిస్తాం

పురపాలక హెల్ప్‌లైన్‌కు సంబంధించి కమిషనర్‌తోపాటు, సిబ్బందితో సమీక్షిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– శ్రీమంత్‌రెడ్డి, పుర ఛైర్మన్

జెండా ఉత్సవంలో నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రమణకుమార్

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరులో నిర్వహించే జెండా ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో సోమవారం జెండా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఎవరైనా నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జెండా ఉత్సవం చేయాలన్నారు. 500 మంది సిబ్బందితో ఉత్సవాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఐలు కిషోర్‌బాబు, శ్రీనివాస్, ఎస్సైలు గోపాల్‌యాదవ్, తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

చిల్లకూరు, న్యూస్‌టుడే: నెలబల్లి రెట్టపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు పి.శ్రీహర్షిణి, కె.భవిష్య రాష్ట్రస్థాయి హ్యాండ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని విజయలక్ష్మి సోమవారం తెలిపారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడ ప్రాంగణంలో అండర్-14 బాలికల విభాగంలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టులో చోటు దక్కించుకున్నారని చెప్పారు. విద్యార్థినులతోపాటు పీడీ మస్తాన్‌బీని ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య విద్యార్థినికి అభినందన

వాకాడు: సిద్ధవరం గ్రామానికి చెందిన పవిత్ర తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైద్య కళాశాలలో సీటు సాధించింది. దాంతో బాలిరెడ్డిపాలెంలోని శ్రీసీతారామా ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థిని వాకాడు సహకార సంఘం మాజీ ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, సంస్థ ప్రతినిధులు అభినందించారు.

క్రీడా దుస్తుల పంపిణీ

వాకాడు: వాకాడుకు చెందిన జాలాది అబ్రహం జోసఫ్ పాల్ జ్ఞాపకార్థం ఆయన సోదరి అశ్రిత ఏంజెలిన్ రూ.25 వేలతో పేద విద్యార్థులకు క్రీడా దుస్తులను ఎంఈవో బీవీ కృష్ణయ్య చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

వృద్ధులకు భోజన వసతి

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట మేరీ ఆశ్రమంలోని వృద్ధులకు సోమవారం నెల్లూరు జిల్లా కోవూరు వాసి ఎన్.మనోజ్ భోజన వసతి కల్పించారు.

సంపద కేంద్రాలు పునఃప్రారంభం

నాయుడుపేట, న్యూస్‌టుడే: నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను సర్పంచి సోమవారం పునఃప్రారంభించారు. తిమ్మాజీకండ్రిగ కేంద్రాన్ని సర్పంచి ప్రకాష్, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ గోపాల్ ప్రారంభించారు. మేనకూరు, పండ్లూరు గొట్టిప్రోలు కేంద్రాలను కూడా తిరిగి ప్రారంభించారు.

సత్కారం

పెళ్లకూరు, న్యూస్‌టుడే: ఎగువతాగేలి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసమూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాలు ఘనంగా సన్మానించాయి. ఎంఈవో శంకరయ్య, పీఆర్‌టీయూ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, మురళీ, చినబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైంది

పెళ్లకూరు, న్యూస్‌టుడే: అన్నింట్లో కల్లా ఉపాధ్యాయవృత్తి గౌరవప్రదమైందని దొరవారిసత్రం ఎంఈవో మునిశేఖర్ తెలిపారు. పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మునికృష్ణయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం సన్మానం చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంకు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేతలు

నాయుడుపేట: పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను సోమవారం ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, కిషోర్‌లు నాయుడుపేట అగ్రహారపేటలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆవిష్కరించి పార్టీ నేతలకు అందజేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

3 నుంచి బ్రహ్మోత్సవాలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: అయ్యపరెడ్డిపాళెంలోని శ్రీమల్లికాంబ శరవణభవాశ్రమంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు ఆరాధన బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పొలం విషయమై ఘర్షణ

తడ, న్యూస్‌టుడే: వాటంబేడు ఎస్సీ కాలనీకి చెందిన సిరివేటి కోటేశ్వరరావు, సిరివేటి గణపతి కుటుంబాల మధ్య పొలం సరిహద్దు విషయమై ఆదివారం ఘర్షణ జరిగింది. మేరకు ఇరువర్గాల ఫిర్యాదు మేరకు సోమవారం కేసులు నమోదు చేసినట్టు ఎస్సై కొండప్ప నాయుడు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

గిరిజనులకు భూములు అప్పగించండి

వెంకటగిరి: ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న భూములను తమకు అప్పగించాలంటూ పలుగోడు గ్రామానికి చెందిన గిరిజనులు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. యానాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య మాట్లాడుతూ.. పలుగోడులోని సర్వే నంబరు1లో 40 మంది గిరిజనులు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. భూములకు పట్టాలు లేకపోవడంతో భూస్వాములు స్వాధీనం చేసుకుంటున్నారన్నారు. పట్టాలు అందించాలన్నారు.

నిమ్మలో సాంకేతిక పద్ధతులు పాటించండి



రైతుకు సైకోసెల్ హార్మోన్ ప్యాకెట్ అందిస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి, న్యూస్‌టుడే: నిమ్మసాగులో సాంకేతిక పద్ధతులు పాటించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ అన్నారు. పట్టణంలోని కేవీకేలో నిమ్మలో పూత నియంత్రణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిమ్మలో అధిక దిగుబడి సాధించేందుకు సైకోసిల్ హార్మోన్ వినియోగించాలన్నారు. శాస్త్రవేత్త నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హడావుడి నిర్మాణాలు.. నాణ్యతా లోపాలు

వరదొస్తే మళ్లీ ముంపే ● తూతూమంత్రంగా ఎఫ్‌డీఆర్ పనులు



దుగరాజపట్నం కొత్తూరు వద్ద ఎత్తుగా నిర్మించిన పాత తూములు

వాకాడు, న్యూస్‌టుడే: గతేడాది డిసెంబరులో వచ్చిన వరదలకు నాయుడుపేట-దుగరాజపట్నం మార్గంలోని కొత్తూరు-ముక్కిడిపాలెం రోడ్డు వద్ద ఉన్న వంతెనకు గండి పడి తూములతో సహా కొట్టుకుపోయిన విషయం విదితమే. దాంతో రభ ఇంజినీర్లు ఎఫ్‌డీఆర్ పనుల కింద రూ.లక్ష నిధులతో తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టారు. ఆ పనులు కూడా పాత తూములపై గ్రావెల్ వేసి మమ అనిపించారు. అయితే తూముల ద్వారా నీరు పారేందుకు వీలు లేకుండా గ్రావెల్ వేయడంతో మరలా వరద వస్తే దుగరాజపట్నం ప్రాంతంలోని పొలాలు, కొత్తూరు గ్రామం ముంపునకు గురికాక తప్పదని అక్కడి ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకాపా పాలనలో ఇష్టారాజ్యంగా ఎఫ్‌డీఆర్ పనులను చేయడంతోనే ఈ పరిస్థితి తలెత్తిందని వాపోతున్నారు.

చిన్నపాటి వంతెనలు అవసరం..

వాకాడు మండలంలోని కల్లూరు, కోడివాక, తిరుమూరు చెరువుల్లోని కలుజుల ద్వారా వచ్చే వృథా నీరంతా ఈ తూముల ద్వారా సముద్రంలోకి చేరుతుంది. అయితే ఇక్కడ తూములు కాకుండా చిన్నపాటి వంతెన నిర్మిస్తే ఆ నీరంతా ఆగకుండా నేరుగా సముద్రంలోకి చేరుతుందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకుంటే గ్రామంతో పాటు, పొలాలకు ముంపు వాటిల్లదని చెబుతున్నారు.

ప్రతిపాదనలతోనే సరి..

వైకాపా పాలనలో ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలతో సరిపెట్టారే తప్ప ఎలాంటి నిధులు విడుదల చేయకపోవడంతో ఏటా ముంపుబారిన పడుతున్నారు. నాయుడుపేట-దుగరాజపట్నం రోడ్డు విస్తరణ పనులను చిట్టమూరు మండలం కొత్తగుంట వరకు చేపట్టి తర్వాత వదిలేశారు. ఇక్కడ వంతెన కూడా నిర్మించలేదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని వంతెన నిర్మించి ముంపు నుంచి కాపాడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధుల ఆలస్యం

వంతెన నిర్మాణానికి గతంలో రూ.59 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. నిధులు రాకపోవడంతో రూ.లక్ష నిధులతో ఎఫ్‌డీఆర్ పనుల కింద తాత్కాలిక పనులు చేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– రామాంజనేయులు, రభ ఈఈ, గూడూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. గూడూరు: 85002 02046, నాయుడుపేట: 80085 73970, సూళ్లూరుపేట: 96188 78782, వెంకటగిరి: 80085 73966; సమయం 10 AM TO 1 PM

న్యూస్‌టుడే, కోట

సమస్య: వెంకన్నపాలెం-బూపాలెం రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు అలముకున్నాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. - రాంబాబు, స్థానికుడు

సమాధానం: పరిశీలించి జంగిల్ క్లియరెన్స్ ప్రతిపాదనలు పంపుతాం. - కిరణ్, ఇన్‌ఛార్జి ఏఈ

న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

సమస్య: పురపాలక పరిధిలోని పలు కాలనీల్లో పగలు విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. పగటి పూట దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలి. - సుబ్రహ్మణ్యం, స్థానికుడు

సమాధానం: విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం. - ఫజులుల్లా, కమిషనర్, నాయుడుపేట

న్యూస్‌టుడే, సూళ్లూరుపేట

సమస్య: సూళ్లూరుపేట పురపాలికలో కావ్యవీధిలో టెలిఫోన్ ఎక్స్ఛేంజికి వెళ్లే రోడ్డు మలుపులో కాలువ నిర్మాణానికి తవ్వకాలు జరిపారు. సత్వరంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి. - స్థానికులు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా మలుపు వద్ద గుంతలను పూడ్చి వేసేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసులు, పురపాలక డీఈఈ

న్యూస్‌టుడే, గూడూరు పట్టణం

సమస్య: గూడూరు రెండో పట్టణం గాంధీనగర్ ప్రాంతంలోని కాలువల్లో మురుగు కదలడం లేదు. దుర్వాసనతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. – గోపాల్, గూడూరు

సమాధానం: కాలువల్లో సిబ్బంది చేత పూడిక తొలగిస్తాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్, గూడూరు

వీధి కుక్కలకు టీకాలు

ఈనాడు కథనాలకు స్పందన

కోట, న్యూస్‌టుడే: స్థానిక పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో వైద్యులు సోమవారం వీధి కుక్కలకు గర్భనియంత్రణ టీకాలుతో పాటు రేబిస్ వాక్సిన్ వేశారు. ఇటీవల 'ఈనాడు'లో 'కుక్కలు బాబోయ్.. కుక్కలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఆ మేరకు స్పందించిన అధికారులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ ఈవో శ్రీనివాసులు తెలిపారు.

వ్యర్థాలు తొలగించారు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వార్డులతో పాటు శివారు కాలనీల్లో చెత్త నిల్వలు పేరుకుపోయాయి. ఈ విషయమై 'ఈనాడు'లో 'ఇలా ఉంటే వ్యాధులు రావా' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు సిబ్బందితో శివారు ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త నిల్వలు తొలగించారు.

శుద్ధనీటిని అందించండి

కోట, న్యూస్‌టుడే: నార్త్‌గిరిజనకాలనీ, జరుగుమల్లి పంచాయతీలో జల జీవన్ మిషన్ ద్వారా వచ్చే నీటిని తాగేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని భాజపా మండల అధ్యక్షుడు రమేష్‌బాబు అధికారులకు విన్నవించారు. ఎంపీడీవో భవాని, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరవింద్, పంచాయతీ ఈవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందించి శుద్ధనీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రుణ వసూళ్లపై దృష్టి సారించాలి

వాకాడు, న్యూస్‌టుడే: మండలంలో శ్రీనిధి, ఉన్నతి, ఇతర బ్యాంకు లింకేజీ రుణ బకాయిల వసూళ్లలో వెనుకంజలో ఉన్నారని వాటిని సత్వరమే వసూలు చేయాలని వెలుగు గూడూరు ఏరియా సమన్వయకర్త మురళీ పేర్కొన్నారు. మండలంలోని సీసీలు, వీవోఏలతో సోమవారం సమీక్ష జరిపారు. ప్రతి వీవోఏ పరిధిలో ఉన్న రుణ బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వసూళ్లలో ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. శ్రీనిధి మేనేజరు జయకుమార్, ఏపీఎం మాధవి, పాల్గొన్నారు.

ఏరియా సమన్వయకర్తగా మురళి

వాకాడు: గూడూరునియోజకవర్గం వెలుగు పథకం ఏరియా సమన్వయకర్తగా మురళీ నియమితులయ్యారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.